

పెనుమూడి వద్ద వరద ప్రవాహం



# బిరబిరా.. కృష్ణమ్మ

బిరబిరా పరుగులతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలతో.. శ్రీశైలం నుంచి భారీగా వరద పోటెత్తుతుండటంతో నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాలతో పాటు ప్రకాశం బ్యారేజీ నిండుకుండల్లా మారాయి. సాగర్‌కు భారీగా వరదతో 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. లక్షల క్యూసెక్కులు సముద్రం దిశగా పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజీకి ఎగువున కృష్ణమ్మ సోయగాలతో కనువిందు చేస్తుండగా దిగువున వరద భయంతో ప్రజలను వణికి స్తోంది. నదీ తీరం వెంట గంటగంటకు వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా జూలై నెలలో కృష్ణానదిలో నీటి ప్రవాహం ఉంది. పైగా నాగార్జున సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు జలాశయాలు నిండుకుండల్లా మారడం.. భారీగా వరద నీటి విడుదలతో పలు ప్రాంతాల్లో రైతులు ముమ్మరంగా సాగు పనులు చేపట్టారు. అయితే డెల్టా పరిధిలోని లంక గ్రామాల్లోని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.


భట్టిప్రోలు : పెదలంక అరటి తోట


చింతల్లంక వద్ద కళకళలాడుతున్న కంద పైరు

- జలాశయాల గేట్ల నుంచి జాలువారుతూ.. ఒకవైపు కనువిందు.. మరోవైపు వరద భయం
- సాగర్‌కు కొనసాగుతున్న వరద.. 26 గేట్లు ఎత్తి విడుదల
- ఇన్‌ఫ్లో 3,01,350 క్యూసెక్కులు.. ఔట్‌ఫ్లో 2,54,668 క్యూసెక్కులు
- వరద హెచ్చరికతో భయాందోళనల్లో లంక గ్రామాల రైతులు

నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 2,82,364 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో బుధవారం అధికారులు 26 క్రస్ట్ గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 16 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 10 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,65,816 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,826, కుడి కాల్వ ద్వారా 8144, ఎడమ కాల్వ ద్వారా 7272, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో 3,12,158 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.20 అడుగులు ఉంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 2,82,364 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

## బ్యారేజీకి పెరిగిన ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలు

ప్రకాశం బ్యారేజ్ వద్ద గంట గంటకు ఇన్‌ఫ్లో, అ వుట్‌ఫ్లోలు పెరుగుతున్నా యి. బుధవారం రాత్రి 9.30 గం టలకు 1,21,679 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజ్ వద్దకు చేరుతున్నట్లు ఇరిగేషన్‌వర్గాలు గుర్తించాయి. బ్యారేజ్‌లో నీటిమట్టం 12 అడుగుల వద్ద కొనసాగుతున్నది. 60 గేట్లను రెండు అడుగులు, 10 గేట్లను మూడు అడుగులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేఈ మెయిన్ కెనాల్‌కు 10,207, కేడబ్ల్యూ మెయిన్ కెనాల్‌కు 6,522, గుంటూరు ఛానల్‌కు 200, సముద్రంలోకి 1,04,750,750 క్యూసెక్కుల వరదనీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలు గురువారం ఉదయానికి మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు.



## అప్రమత్తం.. హెచ్చరికలు

ఎగువ నుంచి పెద్దఎత్తున నీటి ప్రవాహంతో నదీ పరివాహక ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేశారు. రెవెన్యూ, పోలీసు శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాయి. గజఈత గాళ్లను సిద్ధం చేశారు. పశువులను నదిలోకి దింప వద్దని రెవెన్యూ శాఖ హెచ్చరించింది. పడవలను కూడా నిషేధించారు. అవసరమైన ప్రాంతాల్లో నది వెంట పోలీసు పహరా ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు వరద ప్రవాహంపై తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.


వరద ముప్పుపై డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో రామలక్ష్మి

కొల్లూరు, రేపల్లె, గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఉరుకులు పరుగులతో సాగరం దిశగా ప్రవ హిస్తోంది. నిండుకున్న జలాశయాల నుంచి నీటి విడుదలతో ప్రకృతి ప్రేమికులకు కను విందు చేస్తూ పరవళ్లు తొక్కుతోంది. నాగా ర్జున సాగర్, టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బ్యారేజిల నుంచి భారీగా వరద ప్రవహిస్తోంది. ఎక్కడికక్కడ అధికారులు ఇన్‌ఫ్లోను అంచనా వేసి నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద పోటెత్తుతుండటంతో మంగళవారం సాయంత్రం నుంచే అన్ని గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదలు చేస్తున్నారు. దీంతో భారీగా వస్తోన్న వరదను టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల వద్ద కూడా అన్ని గేట్లు ఎత్తి దిగువకు పంపుతున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనట్లుగా కృష్ణమ్మ ప్రవాహం ముందుకు సాగుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. సాగర్‌లో 586.20 అడుగుల మేర నీటి మట్టం ఉండగా ఇది 301.36 టీఎంసీలకు సమానం.

### బుగ్గవాగు నుంచి నీటి విడుదల

జవహర్ కుడికాల్వ జలకళ సంతరించుకుంది. బుగ్గవాగు నుంచి కుడికాల్వకు 7,500 కూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేసినట్లు జలవనరుల శాఖ ఎస్‌సీ కృష్ణ మోహన్ తెలిపారు. బుగ్గవాగు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 3.46 టీఎంసీలు కాగా 2.33 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. కుడి కాల్వ నుంచి గుంటూరు, అద్దంకి, బెల్లంకొండ, జూలకల్లు బ్రాంచ్ కాలువలకు నీటిని విడుదల చేశారు.

### నిండు కుండలా పులిచింతల

వరద పోటెత్తుతుండటంతో పులిచింతల జలాశయం జలకళ సంతరించుకుంది. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టు నిండు కుండలా మారింది. డ్యాం సామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను నీటి నిల్వ 41.34 టీఎంసీలకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 172.08 అడుగులకు చేరింది. గరిష్టస్థాయికి నీటి మట్టం చేరడంతో డ్యాంలోకి వచ్చిన నీటిని వచ్చినట్టుగా విడుదల చేసేందుకు (మిగతా 6వ పేజీలో)


పోతార్లంక వద్ద వేసిన పసుపు పైరు

## పొగాకు కొనుగోలులో
# ప్రమాణాలను పాటించాలి

- వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ సునీత

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ పొగాకు కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీత సూచించారు. బాపట్ల, చీరాల, పర్చూరు మండలాలలో బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన నల్ల బర్లీ కొనుగోలు కేంద్రాలు, గోదాములలో నిల్వ చేసిన పొగాకును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న పొగాకును భద్రంగా నిల్వ చేయాలని తెలిపారు. రైతులు నుంచి పొగాకు కొనుగోలు చేసే సమయంలో అధికారులు తేమశాతాన్ని ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. జిల్లాలో ఉన్న గోదాములు నిండితే ఇక్కడ ఉన్న పొగాకును పొరుగు జిల్లాల్లోని గోదాములకు తరలించాలన్నారు. ముందస్తుగానే గోదాములను ఎంపిక చేసుకొని వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ, జిల్లా మార్కెటింగ్‌శాఖాధికారి రమేష్‌బాబు పర్యటనలో పాల్గొన్నారు.


బాపట్ల మార్కెట్‌యార్డులోని గోదాములను పరిశీలిస్తున్న వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ సునీత

# శిథిలావస్థలో ఎత్తిపోతల పైపులు

బాపట్ల రూరల్,జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం పేరలి డ్రెయిన్ కాల్వపై ఉన్న పాండురంగాపురం ఎత్తిపోతల పథకం పైపులు శిథిలావ్థకు చేరాయి. తుప్పు పట్టి కన్నాలు పడడంతో, నీరు వృధాగా పోతోంది. నీటి లీకుల నివారణకు అధికారులు పట్టాలు కట్టడం గమనార్హం. వీటి ద్వారానే వేల ఎకరాలకు నీరు అందుతుంది. ఇదే సమస్య భావపురి ఎత్తిపోతల పథకంలో కూడా ఉన్నది. వర్షాకాలం మొదలవ్వటంతో వరిపంటలు వేసుకునేందుకు రైతులు సన్నద్ధమౌతున్నారు. కావున సంబంధిత ఇరిగేషన్‌శాఖ వారు, సంబంధితాధికారులు స్పందించి వెంటనే ఈ ఎత్తిపోతల సంబంధించిన శిథిలావస్థకు చేరిన పైపులను మార్చాలని కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన సిప్‌పైప్‌లైన్


పాండురంగాపురం ఎత్తిపోతల పథకం భవనం

# ఏడాదైనా.. ఎక్కడివక్కడే!

- అటు సదస్సులు.... ఇటు కుప్పలుగా రెవెన్యూ అర్జీలు
- ఏడాది పాలన దాటినా కొలిక్కిరాని రెవెన్యూ సమస్యలు
- పీజీఆర్ఎస్‌లో ఇప్పటికీ 70 శాతం భూ సంబంధిత అర్జీలే
- ఆరు నెలల వ్యవధిలో 3,478 వినతులు
- గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చినవి అదనం
- నత్తనడకన సాగుతున్న రీసర్వే అంకం
- అర్జీల పరిష్కారంలో జిల్లాకు 19వస్థానం
- అధికారుల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి

ఐదేళ్ల వైసీపీ పాలనలో భూసంబంధిత వివాదాలు అనేకం... కొన్ని యజమానుల మధ్య వివాదాలు అయితే, మరికొన్ని ఆపార్టీ నేతల ధనదాహం వల్ల వివాదంగా మారినవి. అధికారాన్ని ఉపయోగించి రికార్డులను తారుమారు చేసి మరీ పలు చోట్ల భూములను కైంకర్యం చేసిన ఘనత గత పాలకులది. ఇలా రెవెన్యూకు సంబంధించి అనేక అక్రమాలకు పాల్పడడంతో వేల సంఖ్యలో బాధితులు తయారయ్యారు. గత ప్రభుత్వ హయాంలోనే అనేక మంది భూ బాధితులు పలు వేదికలపై తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ అర్జీలు అందించారు. ఈ ప్రభుత్వం కొలువుదీరగానే రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించిన సంగతి తెలిసిందే. ప్రత్యేకంగా గ్రామసభల నిర్వహణతో పాటు రెవెన్యూ సదస్సులను పెద్ద ఎత్తున జరిపి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించింది. ఈ రెండు వేదికలమీద నుంచే జిల్లా వ్యాప్తంగా దాదాపు 5,600 భూ సంబంధమైన వినతులు ప్రజల నుంచి వచ్చాయి. ఇవి కాకుండా ప్రతిసోమవారం కలెక్టరేట్ వేదికగా నిర్వహించే పీజీఆర్ఎస్(ప్రజాసమస్యల పరిష్కార వేదిక)లో వచ్చినవి అదనం. దాదాపు ఏడాది కాలం నుంచి రెవెన్యూ యంత్రాంగం మొత్తాన్ని ఈ సమస్యల పరిష్కారం మీదే ప్రభుత్వం మొహరించింది. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు సగటున 200 అర్జీలు వస్తే వీటిలో 150 వరకు రెవెన్యూవే ఉండడం గమనార్హం.


కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు పెద్ద సంఖ్యలో వస్తున్న రెవెన్యూ బాధితులు (ఫైల్ ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సభలు, సదస్సులతో పాటు పీజీఆర్ఎస్ లాంటి అనేక వేదికలపై నుంచి రెవెన్యూ వినతులు స్వీకరించినా పరిష్కారం మాత్రం లభించడం లేదనేది ఇప్పటికీ వస్తున్న అర్జీలే నిరూపణగా ఉన్నాయి. పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీల పరిష్కారంపై ఇటీవలే ప్రభుత్వం ఓ సర్వే నిర్వహించగా బాపట్ల జిల్లాకు 19వ స్థానం దక్కింది. ఈ ర్యాంకు యంత్రాంగం పనితీరుకు అద్దం పడుతుందని సోమవారం నాటి సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం

**సమస్య ఒకటే ....కానీ అనేక వేదికలు**

ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెల చివరి వరకు కేవలం రెవెన్యూ సమస్యల మీదనే 3,478 అర్జీలు పీఆర్‌జీఎస్‌కు వచ్చాయి. ఇక ప్రభుత్వం (మిగతా 6లో)


కోడికి కత్తికట్టి పందానికి సిద్ధం చేస్తున్న జూదరులు

# జోరుగా కోడి పందాలు

కొల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా తీరంలోని మండలం సుగ్గునలంక పరిసరాల్లో కోడి పందాలు జోరుగా సాగుతున్నాయి. బరులు ఏర్పాటు చేసి నిత్యం కోడి పందాలు నిర్వహిస్తున్నారు. కృష్ణా జిల్లాతో పాటు గుంటూరు జిల్లా కొల్లిపర మండలం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలం నుంచి నిత్యం 30-40 మంది జూదరులు కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చి పందాలు వేస్తున్నారు. రోజు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల దాకా పందాలు జరుగుతున్నట్లుగా సమాచారం. కనిగిరిలంక, చిలుమూరులంక, ఈపూరులంక పరిధిలో కూడా ముసుగు పందాలు జరుగుతున్నట్లు సమాచారం. బరుల వద్ద ఒక్కోసారి వివాదాలు చోటు చేసుకుని కొట్లాటలకు సైతం దారి తీస్తోంది.

# ఉపాధి అవకతవకలపై తనిఖీలు

## కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవో పనుల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలపై కలెక్టర్ వెంకటమురళి స్పందించి తనిఖీలకు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీలకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, కన్వీనర్ డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి బుధవారం బల్లికురవ వచ్చి తొలుత ఎంపీడీవో పాండురంగస్వామి, తహసీల్దారు రవినాయక్‌లతో సమీక్షిం చారు. ఆనంతరం వారు మండలంలోని కొమ్మినేనివారిపాలెం, వైదన, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాలలో గత ఏడాది కాలంలో నిర్వహించిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బోగస్ మస్టర్లుతో ఉపాధి నిధులు దుర్వినియెగం, పనుల్లో అవకతవకలపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. ఉపాధి పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు, అంగన్‌వాడీ టీచర్లకు మస్టర్లు వేశారని ఫిర్యాదులపై విచారణ చేపడతామన్నారు.


వైదన గ్రామం వద్ద ఉపాధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి

## మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం అందరి బాధ్యత

- బస్టాండ్‌లలో అదనపు సౌకర్యాలు కల్పించాలి
- సమీక్షలో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ళ

## ఉపాధిలో.. అవినీతికి చెక్

- నిబంధనలు కఠినతరం
- శ్రామికుల యాప్‌లో అప్‌లోడ్
- ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

## ప్రతి గ్రామం పరిశుభ్రంగా..

- క్లీన్ విలేజ్.. క్లీన్ కొలకలూరుకు మంత్రి మనోహర్ శ్రీకారం
- వినూత్న రీతిలో రోజంతా ఒక గ్రామంలోనే ...

8

## కాకాని శివాలయం హుండీ ఆదాయం రూ.64,92,250



పెదకాకాని శివాలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

పెదకాకాని, జూలై 30(ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానము ఆలయ ప్రాంగణములో ఉన్న కానుకల హుండీలను తెరచి కల్యాణ మండపము నందు బుధవారం లెక్కించినట్లు ఆలయ ఉపకమిషనరు లీలాకుమార్ తెలిపారు. హుండీల లెక్కింపునకు దేవదాయశాఖ పర్యవేక్షణాధికారిగా సహాయ కమిషనర్, జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి సైదమ్మబాయి పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. దేవస్థానమునకు గడిచిన 120 రోజుల కానుకల హుండీల ద్వారా రూ.64,92,250, అన్న ప్రసాదం హుండీ ఆదాయం రూ.3,13,782, బంగారం 63.5గ్రాములు, వెండి 795గ్రాములు, విదేశీ కరెన్సీ 623 అమెరికన్ డాలర్లు ఆదాయము వచ్చిందని గోగినేని లీలాకుమార్ తెలిపారు. హుండీ లెక్కింపు నందు కార్యాలయ సిబ్బంది, కెనరా బ్యాంకు సిబ్బంది,సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రగతి పోర్టల్‌పై అవగాహన ఉండాలి

● జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతి బసు



ప్రసంగిస్తున్న సీఈఓ వీర్ల జ్యోతి బసు

గుంటూరు సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందితో పాటు, గ్రామ సచివాలయం లో పనిచేస్తున్న వారు కూడా ప్రగతి పోర్టల్ నిర్వహణపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు అన్నారు. బుధవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రగతి పోర్టల్ నిర్వహణపై ఉమ్మడి జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీఓలు, ఐదుగురు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఈఓ జ్యోతి బసు మాట్లాడుతూ గ్రామ, మండలస్థాయిలో జరిగిన ప్రతి పనిని నివేదిక రూపంలో పంపితేనే ఉద్యోగులు సరిగ్గా పనిచేసినట్లు అవుతుందని అన్నారు. జిల్లాలో పర్యటించనున్న స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ సిబ్బందికి సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకునే విషయంలో పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని సూచించారు. శిక్షణ తరగతులకు వచ్చిన ప్రతి ఒక్కరికీ డీ రవీంద్ర బాబు, డీపీఎం నాగేశ్వరరావు పూర్తిస్థాయిలో శిక్షణను ఇచ్చి, సాంకేతిక పరంగా కార్యదర్శులకు వచ్చిన పలు సందేహాలు నివృత్తి చేయడమైనది. ఈ కార్యక్రమంలో డీఎల్ పీ ఓ కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# 11 సీట్లొచ్చినా వైసీపీ బుద్ధి మారలేదు

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



రెంటచింతల,జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీకి 11 సీట్లిచ్చి ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలు తీర్పిచ్చినా వారి బుద్ధి మారలేదని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రెంటచింతలలో టీడీపీ సీనియర్ నేత మూలిరాయపరెడ్డి ఇంట జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ అధికారంలో ఉన్నంత కాలం అక్రమంగా కేసులు పెట్టి టీడీపీ వాళ్లను వేధించడం, చంపడం, మద్యం ముసుగులో రంగునీళ్లు పోసి పేదల ప్రాణాలను హరించారని ఆరోపించారు. లిక్కర్ కేసు దోషులంతా జైళ్లకు వెళ్తున్నారు. అప్పుడే ఏమైంది.. సినిమాలో సెకండ్ ఆఫ్ చూడబోతున్నారంటూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాట్ కామెంట్స్ చేశారు. గత పాలకుల హయాంలో ఐఏఎస్, ఐపీఎస్‌లు జైళ్లపాలయ్యారని అందుకు ఐపీఎస్ సీతారామాంజనేయులు ఓ ఉదాహరణగా పేర్కొన్నారు. చంద్రబాబును నంద్యాలలో అక్రమంగా అరెస్ట్ చేసిన తరువాత ఐపీఎస్ సీతారామాంజనేయులు అభ్యంతరకర భాషను ఉపయోగించారని ఈరోజున ఏమైందని ప్రశ్నించారు. మాచర్ల, గురజాల నియోజకవర్గంలో గతంలో దా రుణమైన పరిస్థితులుండేవని ఇప్పుడు ప్ర శాంతంగా ఉందన్నారు. ఈ సమావేశంలో యువనేత జూలకంటి గౌతమ్‌రెడ్డి, గొంటు ఆదిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి,సుమంత్‌రెడ్డి,కుర్రి శివారెడ్డి,రాజారెడ్డి,రామకృష్ణ, శౌరెడ్డి,ఎనుముల కేశవరెడ్డి,చేర్రెడ్డి కోటిరెడ్డి, డీసీ మాజీ చైర్మన్ నరసింహారావు,తుమ్మా జోజిరెడ్డి,కావూరి నాగయ్య, లిం గాపున్నారావు,అల్లం బ్రహ్మారెడ్డి,శీలంనేని సోదరులు,అల్లం బ్రహ్మారెడ్డి,సామ్యేల్ పాల్గొన్నారు.

# 12 ఇసుక డంప్‌లు సీజ్



చామర్రు వద్ద పొలాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను స్వాధీనం చేసుకున్న తహసీల్దార్ కే శ్రీనివాసరావు, మైనింగ్ అధికారులు

అచ్చంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండలంలో అక్రమంగా ఇసుకను డంప్ చేసిన 12 కుప్పలను గుర్తించి సీజ్ చేసినట్లు అచ్చంపేట తహసీల్దార్ కే శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం తహసీల్దార్‌తో పాటు మైనింగ్ ఫీల్డ్ అధికారి కల్యాణి, ఇతర అధికారులతో కలసి కృష్ణా నది పరిసర ప్రాంతాల గ్రామాలైన చామర్రు, అంబడిపూడి గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను గుర్తించి సీజ్ చేశారు. మండలంలో అన్ని శాఖల అధికారులతో కలసి కమిటీని ఏర్పాటు చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ, మైనింగ్, పంచాయతీ రాజ్, పోలీసు శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలసి కమిటీని ఏర్పాటు చేయగా బుధవారం అనుమతులు లేకుండా ఉన్న కుప్పలను సీజ్ చేసి వీటిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కోనూరులో మూడు స్టాక్ పాయింట్లు, అంబడిపూడి గ్రామంలో నాలుగు స్టాక్ పాయింట్లు అధికారికంగా ఏర్పాటు చేశామని, అనుమతులు తీసుకొని ఇసుకను తీసుకు వెళ్ళవచ్చని తహసీల్దార్ తెలిపారు. సీజ్ చేసిన వారిలో తహసీల్దార్‌తో పాటు మైనింగ్ ఫీల్డ్ అధికారి కల్యాణి, ఏవో వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ, సర్వేయర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు 'ఫసల్ బీమా యోజన'లో చేరాలి

ఆర్థిక సలహాదారు వైభవ్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న వైభవ్ శర్మ

పొన్నూరుటౌన్, జూలై30 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరాలని ఫసల్ బీమా యోజన ఆర్థిక సలహాదారు వైభవ్ శర్మ కోరారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెం, నండూరు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఢిల్లీ నుంచి వైభవ్ శర్మ విచ్చేసి రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ పంటల బీమా పథకంలో గ్రామం యూనిట్‌గా కాకుండా రైతుకు వ్యక్తిగతంగా లబ్ధి చేకూరే విధంగా చేయాలని కోరారు. పంట కోత అనంతరం 15 రోజుల వరకు పోస్ట్ హార్వెస్ట్ నష్టానికి కూడా బీమాలో వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు కూడా పంట రుణాలు పొందితే పంటల బీమా వర్తింప చేయాలన్నారు. రైతులు తెలియచెప్పిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సీహెచ్ తిరుమల దేవి, ఏడీఏ వీ రామ కోటేశ్వరి, ఏవో ఆర్ వెంకటేశ్వరరావు, విస్తరణ అధికారి ఐ శ్రీకాంత్, డీ యామిని తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదైనా.. ఎక్కడివక్కడే..!

(5వ పేజీ తరువాయి)

ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్రామసభలు, రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులు దాదాపు 5,600. నేతలు క్రమం తప్పకుండా ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రజాదర్బార్‌లు సరేసరి. మొత్తం అర్జీల పరిశీలనలో ఒకే సమస్యపై అదే వ్యక్తి దపదఫాలుగా అర్జీల రూపంలో ఇచ్చినవి దాదాపు 950 వరకు ఉన్నట్లు యంత్రాంగం గుర్తించింది. రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీనే తిరిగి పీజీఆర్ఎస్‌కు రావడం ఒక ఎత్తయితే గ్రామ సభల్లో ఇచ్చినదానినే, మళ్లీ నేతల ప్రజాదర్బార్‌లో ఇవ్వడం ఇలాంటివి పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇందులో కొన్ని అధికారులు తిరస్కరించినా సరే ఇంకో వేదికమీదకు దానిని తీసుకెళుతుండడంతో అర్జీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇది కాకుండా సమస్య పరిష్కారం కాకపోవడం కూడా బాధితులు ఒకే అర్జీని అనేక వేదికలపై ఇస్తూ వస్తున్నారు

### యంత్రాంగం నిర్లక్ష్యం కూడా కారణమే...

పెద్ద సంఖ్యలో రెవెన్యూ అర్జీలు వస్తుండడం, ఉన్న సిబ్బంది తక్కువగా ఉండడంతో వాటి డిస్పోజ్ ప్రణాళికబద్ధంగా జరగడం లేదని తెలుస్తోంది. పైగా అర్జీల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగానికి టార్గెట్లు పెడుతుండడంతో కేవలం గణాంకాలకే ప్రాధాన్యం ఇస్తూ, మమ అనిపించే విధంగానే ఈ తంతు జరుగుతుండడంతో అర్జీల పరిష్కారం ఎండమావిగానే మిగులుతోందని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. గ్రామసభలు, రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను, పీజీఆర్ఎస్‌తో అనుసంధానం చేసినట్లు యంత్రాంగం చెబుతోంది. అన్నీ కలిపి దాదాపు 9,000 రెవెన్యూ అర్జీలను డిస్పోజ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ వాటికి సంబంధించి విడివిడిగా గణాంకాలు అడిగితే లేవనే సమాధానమే సదరు వ్యవస్థల వద్ద నుంచి వస్తుండడంతో ఈ ప్రక్రియ ఎంత లోపభూయిష్టంగా జరుగుతుందో అర్థమవుతోంది

### ఇక రీసర్వే మరో ప్రహసనం

గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో అనేక తప్పిదాలు జరిగాయి. వాటన్నింటిని సరిదిద్దడంతో పాటు ఈ ప్రభుత్వం మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసుకుని రెండు ఫేజ్‌లుగా రీ సర్వే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇది నెలల తరబడి సాగుతున్నా ఇప్పటికీ తొలి దశలో చేపట్టిన 25 గ్రామాలకు సంబంధించే ఫైనల్ ఆర్ఎల్ఆర్ సిద్ధం కాకపోవడం ఇది ఏ రీతిన సాగుతుందో తేటతెల్లం చేస్తోంది. పైగా రీసర్వే దాదాపు కొలిక్కి వచ్చిందని అధికారులు చెబుతున్న గ్రామాల నుంచే పదుల సంఖ్యలో అర్జీలు వస్తుండడం విస్మయపరిచేదిలా ఉంది. సిబ్బంది తక్కువగా ఉండడం వలన రీసర్వే వేగంగా జరగడం లేదనేది అధికారుల మాటగా ఉంది

కేవలం అంకెల్లోనే పరిష్కారం చూపే మొక్కుబడి తంతుకు రెవెన్యూ యంత్రాంగం స్వస్తి పలికి సమస్యకు ముగింపు పలకడానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తేనే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుంది. లేకుంటే మరో నాలుగేళ్ల గడిచాక కూడా ఇదే స్థాయిలో రెవెన్యూ అర్జీలు వచ్చినా ఆశ్చర్య పోనవసరం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# బిరబిరా.. కృష్ణమ్మ

(5వ పేజీ తరువాయి)

జలవనరుల శాఖ చర్యలు చేపట్టింది. గంట గంటకు సాగర్ నుంచి ప్రవాహం పెరుగుతుందని పులిచింతల ప్రాజెక్టు డీఈ వెంకట్ తెలిపారు. తాడువాయి వద్ద మత్స్యకారుల పడవలు ఒడ్డుకు చేరాయి. నదీ తీరాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తహసీల్దారు శ్రీనివాసరావు తెలిపారు.

### లంకలకు పొంచి ఉన్న ముప్పు..

కృష్ణానదికి వరద నీరు పోటెత్తుతుండటంతో లంక గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. గత ఏడాది భారీ వరదల నుంచి తేరుకున్న రైతులను ఈ ఏడాది కూడా వరద భయం వెంటాడుతోంది. కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని నదీ పరివాహక ప్రాంతంలో సుమారు 35 గ్రామాల్లో 20 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులు వరద నుంచి రక్షించాలని కృష్ణమ్మను వేడుకుంటున్నారు. బుధవారం రాత్రి 3 లక్షల పైచిలుకు క్యూసెక్కులు విడుదల చేస్తారని అధికారులు ప్రకటించడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### బాపట్ల కలెక్టర్ సమీక్ష

కృష్ణానది వరద నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బుధవారం కొల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రాణనష్టం జరగకుండా పని చేసినట్లు ఇప్పుడు కూడా యంత్రాంగం పని చేయాలన్నారు. కరకట్ట బలహీనంగా ఉన్న చోట్ల ఇసుక బస్తాలతో పటిష్టపరచాలన్నారు. బియ్యం, నిత్యావసరాలు, పడవలు, ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని కొన్ని ప్రాంతాలు వరద ప్రభావితం అవుతాయన్నారు. గతం కంటే మెరుగుగా అధికారులు పని చేసి ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు.

- సత్రశాలలోని టెయిల్‌పాండ్‌లో 14 గేట్ల ద్వారా 2,94,109 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువన సాగర్ నుంచి 2 లక్షల 91 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా రిజర్వాయర్‌లో 6.337 టీఎంసీల నీరుంది. 74.39 మీటర్లు అంటే 247.70 అడుగులకు ఇది సమానం.
- బుధవారం సాయంత్రం పులిచింతల ప్రాజెక్టులో 41.58 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 3,01,167 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 13,600 క్యూసెక్కులు, 12 గేట్ల ద్వారా 2,84,561 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులను విడుదల అవుతుంది.

## జంట హత్య కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 23న బెంగళూరుకు చెందిన తండ్రీకుమారులైన రియల్టర్లు వీరస్వామిరెడ్డి, ప్రశాంత్‌ల హత్య కేసులో నిందితులను నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్థిక వివాదాల నేపథ్యంలో తండ్రీకుమారులను కిడ్నాప్ చేసి సంతమాగులూరు సమీపంలో సంతమాగులూరు గ్రామానికి చెందిన బాదం మాధవరెడ్డి, గడ్డం రఘురాం రెడ్డి, గడ్డం నాగిరెడ్డి, గడ్డం గోపిరెడ్డి, గడ్డం ఇంద్రసేనారెడ్డిల హతమార్చినట్లు కేసు నమోదైన విషయం తెలిసిందే. సీఐలు ఎంవీ చరణ్, హైమారావు, బి.సుబ్బానాయుడు, పి.రామకృష్ణల నేతృత్వంలో ఎస్‌ఐలు హరిబాబు, వంశీకృష్ణ ప్రత్యేక బృందాలుగా ముంబయి వెళ్లి నిందితులను అరెస్టు చేశారు. వీరిని బుధవారం నరసరావుపేటలోని మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి ఆవుల సలోమి ఎదుట హాజరు పరుచగా రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకు మొత్తం 13 మందిని నిందితులుగా పేర్కొన్నారు. గతంలోనే అనిల్ రెడ్డిని అరెస్టు చేశారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. మొత్తం ఆరుగురు నిందితులను మూడు రోజుల వ్యవధిలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఏపీ మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరి గిరిజాశంకర్‌కు పీహెచ్‌డీ



పెదకాకాని, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రూరల్ డెవలప్మెంట్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరి ఎం గిరిజాశంకర్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసింది. ఏఎన్‌యూ రూరల్ డెవలప్మెంట్ విభాగం ఆచార్యులు వి.దివ్యతేజోమూర్తి పర్యవేక్షణలో గిరిజాశంకర్ "రోల్ ఆఫ్ నాచురల్ రిసోర్సెస్ మేనేజ్మెంట్ ఆన్ రూరల్ లైవ్లీహుడ్(ఏ స్టడీ ఆఫ్ వైఎస్సార్ కడప డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం)"అనే అంశంపై పరిశోధనలు పూర్తి చేశారని పరిశోధనా విభాగం సమన్వయకర్త డాక్టర్ పీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గిరిజాశంకర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరి హోదాలో ఉద్యోగ విరమణ చేశారు.

## జోన్ 3 పరిధిలో మరో 18 మందికి ఇన్‌చార్జి ఎంఈఓలుగా బాధ్యతలు

గుంటూరు (విద్య), జూలై 30 (ఆంధ్రజ్యోతి): (ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) జిల్లాల పరిధిలోని మండలాల్లో ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను ఇన్‌చార్జిలతో (ఎఫ్ఏసీ) భర్తీ చేస్తూ ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తుళ్లూరు ఎంఈఓగా ఎన్ అజయ్ కుమార్, పొన్నూరుకు డీ రాజు, మంగళగిరికి ఉషాకుమారి, అమరావతికి కేఎస్ ఎన్ ప్రసాద్, కారంపూడికి జే అనిల్‌కుమార్, క్రోసూరుకు జీ కృష్ణ, ముప్పాళ్లకు పీ సుధారాణి, నూజెండ్లకు కే సత్యనారాయణ, చుండూరుకు జే సురేష్‌బాబు తదితరులను నియమించారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి బెస్తవారిపేట ఎం ఈఓగా మధుసూదన్ రెడ్డి, గిద్దలూరుకు ఎంవీ భాస్కర్‌లను నియమించారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి కందుకూరు ఎంఈఓగా ఎంఎంకే శర్మ, ఒలేటివా రిపాలెంకు పీ మాల్యాద్రి రెడ్డి, గుడ్లూరుకు బీ హరేరామ్, దుత్తలూరుకు ఎన్ పద్మనాభరావు, ఉదయగిరికి టీ వెంకటేశ్వర్లు, చీరాలకు కే కొండయ్య, సైదాపురానికి బాలసుబ్రమణ్యంను ఇన్చార్జి ఎంఈఓలుగా నియమించారు.

## తండ్రిని చంపిన తనయుడుకి జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి ఇవ్వలేదని అక్కసుతో తండ్రిని దారుణంగా హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు నాదెండ్ల మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన గొట్టిపాటి కాంతారావుకు జీవిత ఖైదు రూ. 10,000 జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి నేతి సత్యశ్రీ బుధవారం తీర్పు వెలువరించారు. మృతుడు రోశయ్యకు రెండు పెళ్లిళ్లు అయ్యాయి. రోశయ్యకు మూడు ఎకరాల పొలం ఉంది. మొదటి భార్య కుమారునికి ఒక ఎకరం, రెండో భార్య కుమారుడైన నిందితుడు కాంతారావుకు ఒక ఎకరం పొలం పంచి ఇచ్చాడు. మిగిలిన ఎకరం పొలం తన కోసం ఉంచుకున్నాడు. దుర్వ్యసనాలకు లోనైన నిందితుడు కాంతారావు ఆ ఎకరం కూడా తన పేరున రాయమని మృతుడు రోశయ్యను వేధిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో తండ్రి రోశయ్యను 2019 మే 26న బంధువుల శుభకార్యానికని మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని వెళ్లి నాదెండ్ల ఎండుగుమ్ పాలెం మధ్యగల నక్కవాగు వద్ద గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన చిలకలూరిపేట రూరల్ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడించింది.

## వైసీపీ నుంచి క్రైస్తవులను కాపాడాలి

● ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూలై 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల నుంచి రాష్ట్రంలో క్రైస్తవులను కాపాడాలని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి బుధవారం కోరారు. వైసీపీ ప్రభుత్వంలో క్రైస్తవ సమాజానికి ఏమి చేయకపోవడం వలన క్రైస్తవ సమాజం చంద్రబాబు వైపు మొగ్గు చూపిందన్నారు. 25 శాతం ఉన్న క్రైస్తవ సమాజాన్ని తమ వైపు నిలబెట్టుకోవడానికి వైసీపీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. క్రైస్తవేతరుల చేత చర్చిల మీద కంప్లైంట్లు ఇప్పించి చర్చికి పర్మిషన్ లేదని.. మైకులు పెడుతున్నారనే కారణాలు చూపించి కొన్ని చోట్ల చర్చిలను మూసి వేయిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో చర్చిల మీద దాడులు పెరిగిపోతున్నాయి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు కూడా ఈ విషయాలను గమనించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉపాధ్యాయులకు త్వరలో మూల్యాంకన నిధులు

ఇప్పటికే రూ.65 లక్షలు సీఎఫ్ఎంఎస్ ఖాతాలకు: డీఈఓ సీవీ రేణుక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు (విద్య) జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మూల్యాంకన నిధులు త్వరలో సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ సీవీ రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధ వారం ప్రచురితమైన "మూల్యాంకన వేతనం మరిచారు" శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆమె స్పందిస్తూ ఇప్పటికే రూ. 65 లక్షల నిధులు మంజూరు అ య్యాయని వీటిని సీఎఫ్ఎంఎస్‌కు పంపించినట్లు వివరించారు. విడతలవారీగా ఉపాధ్యాయుల ఖాతాలకు ఆ నిధులు జమ చేస్తామని తెలిపారు. మూల్యాం కనానికి సంబంధించి అన్ని బకాయిల చెల్లింపులు త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

## చికిత్సపొందుతూ మరో యువకుడు మృతి

యడ్లపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులలో మరో యువకుడు మృతిచెందాడు. ఈ నెల 27న పదహారో నంబరు జాతీయరహదారి తిమ్మాపురం కొత్త బైపాస్ మార్గంలోని బ్రిడ్జిపై బుల్లెట్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దొప్పలపూడి హనుమకృష్ణశాస్త్రి, బిరుదు చందు, రాజ్‌పుత్ దిలీప్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిలో దొప్పలపూడి హనుమ కృష్ణశాస్త్రి(25) సోమవారం మృతిచెందిన విషయం విదితమే. కాగా మరో యువకుడు బిరుదు చందు(23) మంగళవారం రాత్రి చికిత్సపొందుతూ మృతి చెందాడు. చందు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం పరీక్షలకు సిద్ధం అవుతూ కోచింగ్ తీసుకుంటున్నాడు. చందు మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు. కాగా రాజ్‌పుత్ దిలీప్‌కుమార్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోందని ఎస్‌ఐ వెల్లడించారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 116, 124, 135 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 220.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 230.00 |


## 40,869 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 42,379 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,869 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,818 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | ఆర్మూరు | 9600 | 11000 |
| 334 | 9500 | 13200 | ఏసీ కామన్ వెరైటీ | | |
| నెంబరు. 5 | 10000 | 13300 | 334 | 9500 | 12600 |
| 273 | --- | --- | నెంబరు. 5 | 10000 | 13400 |
| 341 | 10000 | 13500 | 273 | --- | --- |
| 4884 | --- | --- | 341 | 10000 | 13600 |
| సూపర్ 10 | --- | --- | 4884 | 10000 | 12700 |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | | ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 10000 | 14000 | తేజ | 10000 | 13800 |
| షార్క్-1 | ---- | --- | బ్యాడిగి | 10000 | 12300 |
| బ్యాడిగి | 10000 | 12600 | దేవనూరు డీలక్స్ | 10000 | 12700 |
| దేవనూరు డీలక్స్ | 10000 | 12500 | తాలుకాయలు | 4500 | 7000 |

## మార్క్‌ఫెడ్ ద్వారా బ్లాక్ బర్లీ కొనుగోలు

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మార్క్‌ఫెడ్ ద్వారా బ్లాక్ బర్లీ కొనుగోళ్ళు వేగంగా సాగుతున్నాయని కలెక్టర్ జె.వెంకటమురళి రైతులకు బుధవారం సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు సగటున 300 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు జరుగుతున్నాయని రోజు 600టన్నుల టార్గెట్‌తో వారానికి 1800 టన్నుల పొగాకు కొనుగోలు జరుగుతున్నదని తెలిపారు. పొగాకు తేమశాతం 20 శాతం లోపు ఉండేలా ఉండాలని చెప్పారు. మధ్యవర్తులు, వ్యాపారస్తులు రైతుల పేర్లతో పొగాకు తీసుకురావటం నిషేధమని తెలిపారు. ఈ సంవత్సరం బ్లాక్‌బర్లీ సాగు జిల్లాలో పూర్తిగా నిషేధమని, నారు వేసిన రైతులు, విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తప్పవన్నారు. ఇతర జిల్లాల నుంచి నారు తెచ్చి బ్లాక్ బర్లీ సాగు చేస్తే పంటను ధ్వంసం చేస్తామని తెలిపారు.

## పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల తనిఖీ

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు పురపాలక సంఘ పరిధిలో బుధవారం ఉదయం నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై దాడులను పారిశుధ్య విభాగాధికారులు కొనసాగించారు. కమిషనర్ స్వయంగా దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫ్యాన్సీ దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలపై దాడులను ముమ్మరం చేశారు. సుమారు 70 కిలోల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7 వేల అపరాధ రుసుంను వసూళ్ళు చేశారు. ఇకపై అమ్మకాలు చేస్తున్న దుకాణాలను గుర్తించి సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వ్యాపారస్తులకు కమిషనర్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ తనిఖీలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సయ్యద్ నజీర్, సీహెచ్ కరుణ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కవర్‌లను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, సిబ్బంది

## ఔట్‌సోర్సింగ్ కార్మికుడి కుటుంబానికి చేయూత

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలో ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికునిగా పని చేస్తూ మృతి చెందిన దేవరకొండ రాంబాబు కుటుంబానికి కమిషనర్ జి.రఘునాథరెడ్డి రూ.7.15 లక్షల బెనిఫిట్స్‌ను అందజేశారు. మృతుని భార్య అనురాధకు పీఎఫ్ డబ్బులు రూ.5 లక్షలు, మున్సిపల్ ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షలు, మట్టి ఖర్చులకు రూ.15 వేల చొప్పున అందజేశారు. అదేవిధంగా మృతుని భార్యకు పెన్షన్ రూ.2,901, ఇద్దరు కుమార్తెలకు రూ.725 చొప్పున మంజూరు చేశారు. ఆమెకు ఉద్యోగావకాశం కల్పిస్తామని హామినిచ్చారు.

## టి 10 టెన్నిస్ క్రికెట్ బాల్ జట్టుకు విద్యార్థులు ఎంపిక

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : టి 10 టెన్నిస్ క్రికెట్ బాల్ జిల్లా జట్టుకు బాపట్ల ప్రోడిజి విద్యాలయ విద్యార్థులు ఎంపికయ్యారని టి 10 టెన్నిస్ బాల్ క్రికెట్ జిల్లా కార్యదర్శి బత్తుల వీరశేఖర్ తెలిపారు. బాపట్లసూర్యలంకరోడ్డులోని ప్రోడిజి విద్యాలయలో జిల్లా జట్టు ఎంపికకు గురువారం పోటీలను నిర్వహించగా ప్రోడిజి విద్యాలయ ప్రిన్సిపాల్ బ్రిజేష్ కానూన్‌గో క్రీడాకారుల ఆటను ప్రారంభించారు. జిల్లాలోని పలుపాఠశాలలోని విద్యార్థులు పాల్గొనగా బాపట్ల టి10 టెన్నిస్ క్రికెట్ బాల్ జిల్లా జట్టుకు ప్రోడిజి విద్యాలయ విద్యార్థులు 8 మంది, హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు 8 మంది, మరో నలుగురు విద్యార్థులు జట్టులో ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను ప్రోడిజి విద్యాలయాల సంస్థల ఛైర్మన్ మాసా బత్తిని శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బ్రిజేష్ కానూన్‌గో, డైరెక్టర్‌లు చింతకాయ పార్థసారథి, పెదమల్లు ఉదయచంద్రరావు, బి.సాయిమహేంద్ర బాబు అభినందించారు. ఎంపికైన జిల్లా జట్టు ఆగస్టు 3, 4 తేదీలలో అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వీరశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ జట్టును అభినందిస్తున్న ప్రోడిజి విద్యాలయ ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బ్రిజేష్ కానూన్‌గో

## టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్స్

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఏరియా వైద్యశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో భాగమైన జిల్లా క్షయవ్యాధి నివారణ శాఖ యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార ఆహారపదార్థాలను బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ చేతుల మీదగా బుధవారం పంపిణీ చేశారు. డాక్టర్ సిద్దార్థ మాట్లాడుతూ పౌష్టికాహారంతోపాటు క్రమం తప్పకుండా మందులు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని 1056 క్షయ వ్యాధిగ్రస్తులకు రెండునెలలకు సరిపడే 11 రకాల పౌష్టికాహార కిట్స్‌ను ఏర్పాటు చేయటంలో చొరవ చూపిన కలెక్టర్ జె.వెంకటమురళికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టీఈపీ స్టాఫ్ పాల్గొన్నారు.



టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్‌లను అందజేస్తున్న బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ దగ్గుమల్లి

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ దగ్గుమల్లి కిరణ్‌కుమార్ అన్నారు. బాపట్ల మండల న్యాయసేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో సంస్థ ఛైర్మన్ కె.శ్యాంబాబు ఆదేశాల మేరకు బుధవారం ప్రపంచ ట్రాఫ్కింగ్ డే సందర్భంగా పట్టణంలోని విజయలక్ష్మీపురంలో గల సాయి విద్యాసంస్థ ఇంటర్మీడియట్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ భీమా లీలాకృష్ణ, మీడియేషన్ ట్రైనర్ న్యాయవాది కంచర్ల రవిబాబు, సాయి విద్యాసంస్థ డైరెక్టర్ అంబటి మురళి తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ కిరణ్‌కుమార్

## నేర నియంత్రణపై అవగాహన : ఎస్ఐ

పిట్టలవానిపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిట్టువారిపాలెం గ్రామసచివాలయ పరిధిలోని గ్రామస్థులకు చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ ఆధ్వర్యంలో నేర నియంత్రణపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో యువత చెడుమార్గాలు పట్టకుండా గ్రామస్తులందరు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వాడకంపై నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో చందోలు పోలీసుస్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాని అరికట్టాలి

● జాయింట్ కలెక్టర్ గంగాధర్‌డౌడ్




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాజాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణను అరికట్టాలని జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ, సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో బుధవారం సమావేశం నిర్వహించారు. శిశు సంక్షేమశాఖ పీడీ రాధామాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయటం అభినందనీయమని, నేటి సమాజంలో అనేక రూపాలలో మానవ అక్రమ రవాణ జరుగుతుందన్నారు. బాలకార్మిక, బాల్యవివాహ, అక్రమ రవాణపై సీఫార్డ్ స్వచ్ఛంద సంస్థ చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో దీనిపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమని తెలిపారు. సీఫార్డ్ సంస్థ డైరెక్టర్ కె.రవి ప్రదీప్ మాట్లాడుతూ జిల్లాను బాలకార్మిక, బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుటకు, మానవ అక్రమ రవాణకు వ్యతిరేకంగా కృషి చేయటం జరుగుతుందని తెలిపారు. బాపట్ల ఎంపీడీవో బాబురావు మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాలలో మహిళా సంరక్షణ కార్యదర్శుల ద్వారా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు. ఆర్‌పీఎఫ్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ట్రైనర్‌లలో అక్రమ రవాణాకు గురవుతున్న బాలలను సీఫార్డ్ వారి సహకారంతో గుర్తించి అక్రమ రవాణా చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో పి.పురుషోత్తమరావు, బాలల సంరక్షణాధికారి జి.కృష్ణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయిజ్యోతి, సీఫార్డ్ కోఆర్డినేటర్ బడుగు కిషోర్, నాగరాజు, సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సినిమా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సినారె

● ప్రజాకవి డాక్టర్ ఎస్.శ్రీనివాస్

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సినిమా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి అని, విశ్వనాథ సత్యనారాయణ తర్వాత తెలుగులో ద్వితీయ జ్ఞాన పీఠ పురస్కారాన్ని పొందారని ప్రజాకవి డాక్టర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. బాపట్ల సాహితీభారతి ఆధ్వర్యంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభలో సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, కోశాధికారి ఆదంషఫి, సాహితి భారతి సభ్యులు దగ్గుమల్లి శామ్యూల్ పాల్గొని మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి 70 కావ్యాలు రచించారని, 400పై చిలుకు సినిమాలకు 3500 పాటలు రచించారన్నారు. అనంతరం రచయితలు మర్రిమాల్యాద్రిరావు, కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ఎం.జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు తదితరులు డాక్టర్ సి.నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఘనంగా సామూహిక హారతులు

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపట్ల ధరివాదకొత్తపాలెం రామాలయంలో సామూహిక హారతులను బుధవారం భక్తజనం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ దీపం పరబ్రహ్మ స్వరూపమని సామూహిక హారతుల వల్ల సైన్స్‌పరంగా కూడా వాతావరణ చెడుక్రిములు చనిపోయి వాతావరణ సమతుల్యం ఏర్పడుతుందని తెలిపారు. మనసనాతనమైన హిందూ ధర్మ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహ కన్వీనర్ పులుగు వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు ఏడుకొండలురెడ్డి, మోదడుగు సూరిబాబు పాల్గొన్నారు.

## ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు కృషి చేయాలి

● డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ

బాపట్ల రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద తయారి కేంద్రాల ద్వారా గ్రామాలలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను మెరుగుపర్చటానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ అన్నారు. బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో రెండుతొట్టెలలో వర్మి తయారీ జరుగుతుందని వెంటనే నాలుగు తొట్టెలలో వర్మి తయారీకి సిద్ధం చేయాలని పంచాయతీ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పడమర బాపట్ల పంచాయతీ కార్యదర్శి రవికృష్ణ, సమ్మెటమల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వర్మికంపోస్ట్‌ను పరిశీలిస్తున్న బాపట్ల డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ తదితరులు

## బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అవగాహన

బాపట్లరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ వెదుళ్ళపల్లి ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శ, శక్తియాప్, అత్యవసర టోల్‌ఫ్రీ నెంబర్లు గురించి వారికి అర్థమయ్యే రీతిలో బధిరుల సంకేత భాషలో, దృశ్య పాఠాల రూపంలో అవగాహన కల్పించారు. అదేవిధంగా ఫోక్సో చట్టం, స్త్రీల భద్రత కోసం శక్తి యాప్ వంటి చట్టాలు గురించి వివరించారు. దివ్యాంగులైన విద్యార్థులకు భద్రత కల్పించటం కోసం పోలీసు శాఖ కట్టుబడి ఉందని, భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు నిర్వహించబడుతాయని ఎస్ఐ తెలిపారు.

## రెండు పూరిళ్లు దగ్ధం



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్, సచివాలయ ఉద్యోగులు

పిట్టలవానిపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిట్టువారిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం మధ్యాహ్నం పిట్టువారిపాలెం గ్రామానికి చెందిన బాలభారతి, ఏట్రశివనాగిరెడ్డిలకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. బాలభారతికి సంబంధించిన పూరి గృహం దగ్ధమై రూ.లక్షా 50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలి కుటుంబసభ్యులు తెలిపారు. అదేవిధంగా ఏట్ర శివనాగిరెడ్డికి సంబంధించి పూరి గృహం దగ్ధమై సుమారు రూ.25 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు పేర్కొన్నారు. చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీసు, వీఆర్వో ఘటన స్థలాన్ని పర్యవేక్షించారు

## ముగిసిన ఇంటి స్థలాల సర్వే శిక్షణ

పిట్టలవానిపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాలులో బుధవారం మండలంలోని సంగుపాలెం, కోమలి, పిట్టలవానిపాలెం గ్రామసచివాలయాలకు చెందిన గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిఏలకు, వీఆర్వోలకు బుధవారంతో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ముగిశాయి. సమిత్వ కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమానికి డీవీటీ శ్రీహరి శిక్షకులుగా వ్యవహరించి గ్రామసచివాలయాలకు చెందిన వివిధ శాఖల సచివాలయాల ఉద్యోగులకు ఇంటి స్థలాలకు సంబంధించిన సర్వే శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

## మత్తు పదార్థాలకు బానిసకావొద్దు : ఎస్ఐ

నిజాంపట్నం(రేపల్లె), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ అమూల్యమైన జీవితంలో మత్తుపదార్థాలకు బానిసై అనారోగ్యం పాలవుతున్నారని, మత్తు పదార్థాలను వాడరాదని అడవులదీవి ఎస్ఐ బాబూరావు అన్నారు. నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామంలో ప్రజలకు మత్తుపదార్థాలపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో విలువైన జీవితంలో మత్తుపదార్థాలైన గంజాయి, గుట్కాలకు, బానిసలై జీవితాలను పాడుచేసుకుంటున్నారని, అలాంటి వాటిజోలికి వెళ్ళవద్దని సూచించారు. విద్యార్థులు విద్యలోరాణించాలని, తల్లిదండ్రులు కంటున్న కలలను సాకారం చేసేదిశగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న ఎస్ఐ బాబూరావు

## డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలి : సీపీఎం

రేపల్లె,జూలై30(ఆంధ్రజ్యోతి) : మెప్మాలో రూ.2 కోట్ల అవినీతి వల్ల నష్టపోయిన డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది డ్వాక్రా గ్రూపుల్లో తప్పుడు ధ్రువ పత్రాలు పెట్టి రుణాలు పొంది ఆ రుణాలు గ్రూపుల వారీగా కట్టాలంటూ బ్యాంకు అధికారులు నోటీసులు పంపించటంతో 2023లో ఈ అవినీతి బయటకు వచ్చిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి డ్వాక్రా మహిళలను ఆదుకొని బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

## వరిలో సూక్ష్మధాతు లోపాలు గుర్తించాం

● శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి

వేమూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వరిలో సూక్ష్మధాతు లోపాలు గమనించడం జరిగిందని బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉషారాణి అన్నారు. మండలంలోని వరహాపురం, బలిజేపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రేమ్‌సాగర్ అధ్యక్షతన బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రైతుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఉషారాణి మాట్లాడుతూ, సూక్ష్మధాతు నివారణకు ఫార్ములా ఫోర్ ఎకరాకు ఒక కేజీ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.




రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

## విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న సహిత విద్యాసమన్వయకర్త ఎం.జోత్స్న

రేపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న విభిన్నప్రతిభావంతులకు ప్రభుత్వం వారికి అవసరమైన పరికరాలను అందిస్తుందని సహిత విద్యా సమన్వయకర్త ఎం.జోత్స్న అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భవిత పాఠశాల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని దివ్యాంగ విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్‌ఇన్‌కో మెడికల్ అసిస్‌మెంట్ క్యాంపు సమగ్ర శిక్షణ బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు వారికి కావాల్సిన పరికరాలు, వైద్యపరీక్షలు నిర్వహించి నమూనాలను తీసుకోవటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకా శివరామకృష్ణ, సహిత విద్యా ఉపాధ్యాయులు అనురాధ, సుకన్య, విజయ్‌కుమార్, రవీంద్ర, కల్పన, మహాలక్ష్మీ పాల్గొన్నారు.

## జలదీక్షను జయప్రదం చేయాలి

వేమూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రైతు ప్రయోజనాల కోసం గురువారం భట్టిప్రోలు మండలంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు చేపట్టిన జలదీక్షను రైతులు జయప్రదం చేయాలని రైతు విభాగం అధ్యక్షులు గోపాలం రాము కోరారు. చావలిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలు-గంగోలు ప్రధాన మురుగు కాల్వలో తూటికాడ తొలగించాలని దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

## కృష్ణానది గండ్లను పరిశీలించిన ఆర్డీవో

● బలహీనంగా ఉన్న చోట పటిష్టపరచాలని సూచన

కొల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదికి పడిన గండ్లను రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి పరిశీలించారు. కృష్ణానదికి వరద ముప్పు పొంచి ఉందన్న నేపథ్యంలో మండల పరిధిలోని పెసర్లంక అరవింద వారధి ఎగువన పడిన గండిని ఆర్డీవో బుధవారం పరిశీలించారు. గండి పూడ్చే అంశాలపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌సీఐ విజయరాజు చర్చించారు. అయితే గండి పూడ్చే విషయం ఇప్పుడైతే సాధ్యం కాదని, మొదటి హెచ్చరిక జారీ అయిన తరువాతే గండ్లు పూడ్చివేతలకు సంబంధించి ఉత్తర్వులు ఉన్నతాధికారుల నుంచి వస్తాయన్నారు. మొదటి ప్రమాద హెచ్చరికలు జారీ చేయాలంటే 3.97 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తే సాధ్యమవుతుందని, రెండవ ప్రమాద హెచ్చరిక జారీకి 5.69 లక్షల క్యూసెక్కులు వరద ప్రవాహం దిగువకు విడుదల కావాలని, అప్పుడైతేనే తాత్కాలిక మరమ్మతులకు నిధులు కేటాయించడం జరుగుతుందని ఆర్డీవో తెలిపారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో 10 గండ్లను గుర్తించామని వాటిని పటిష్ట పరిచేందుకు ఇసుక బస్తాలను సిద్ధం చేస్తామని తెలిపారు. ఆయా గండ్లను కూడా ఆర్డీవో పరిశీలించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ గండ్లను పటిష్టపరచాలని ఆర్‌సి అధికారులకు ఆర్డీవో సూచించారు.



పెసర్లంక వద్ద గండిని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

## కృష్ణానదికి వరద ముప్పు

● అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచన

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదికి వరద ప్రవాహం వస్తుండటంతో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులతో తహసీల్దార్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు అధికారులు విడుదల చేశారని, గురువారం సాయంత్రానికి 3 లక్షల క్యూసెక్కుల వరకు కృష్ణానదిలో ప్రవహిస్తుందన్నారు. ప్రజలు ఎవరు నదిలోకి వెళ్లరాదని, పశువులను కూడా దింపకూడదని సూచించారు. బలహీనంగా ఉన్న కరకట్ట ప్రదేశాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్షణ సహాయ చర్యల్లో భాగంగా లైటింగ్ స్టిక్స్ ఏర్పాటు చేసుకోవడంతో పాటు పునరావాస కేంద్రాలను కూడా గుర్తించాలని చెప్పారు. ఈ సమావేశంలో డీటీ, ఆర్ఐ పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారం కోసమే వేదిక

చెరుకుపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రజాసమస్యల ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని రాజవోలు గ్రామంలో బుధవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 45 ఫిర్యాదులు అందాయని, ఎక్కువగా రేషన్ కార్డులు, పెన్షన్‌లు, నివేశన స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని భూసమస్యలు అడంగల్ 1బీ, పాస్‌పుస్తకాల కోసం కొంతమంది దరఖాస్తులు చేసుకున్నారని, వీటన్నింటిని ఆయా శాఖలకు అందించి పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరస్వామి, జై.వెంకటేశ్వరరావు, పి.సీతయ్య, యెండూరు రాఘవ, పి.రాంబాబు పాల్గొన్నారు.



రాజవోలు గ్రామంలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు తాతా ఏడుకొండలు

## రేపు మార్కెట్ యార్డు ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం

● హాజరుకానున్న మంత్రి అనగాని

రేపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని రేపల్లె, కూచినపూడి మార్కెట్ యార్డుల ఛైర్మన్ల, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం ఆగస్టు ఒకటవ తేదీ సాయంత్రం 4.30 గంటలకు స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్వహించటం జరుగుతుందని టీడీపీ రాష్ట్రకార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. ఉదయం 10 గంటలకు భట్టిప్రోలు మండలం వెల్లటూరు ఆక్విడెక్ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం పెనుమూడి గ్రామం, పట్టణంలోని 22వ వార్డులో నూతన పెన్షన్‌ల పంపిణీ జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని, సాయంత్రం 4 గంటలకు నిజాంపట్నం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ గౌతులచ్చన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ళ నారాయణ తదితరులు

## మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

# అందరి బాధ్యత

- తొలినాళ్ళలో జాతరను తలపించే అవకాశం
- బస్టాండ్‌లలో అదనపు సౌకర్యాలు కల్పించాలి
- బస్సులను కండీషన్‌లో ఉంచే బాధ్యత అధికారులదే
- సమీక్షలో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ళ

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి తలపెట్టిన మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకం అమలు బాధ్యత గ్యారేజ్ సిబ్బంది స్థాయి నుంచి అధికారుల వరకు అందరిపై ఉందని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ళ నారాయణ సూచించారు. జోన్-3 పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని డిపో మేనేజర్లతో గుంటూరులోని ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో బుధవారం వారు సమీక్ష నిర్వహించారు. పథకం అమలు చేయనున్న తొలినాళ్ళలో మహిళలతో పెద్ద ఎత్తున జాతర తలపించే పరిస్థితులున్నాయని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ప్రస్తుతమున్న బస్సుల కండీషన్‌ను మరింత తీర్చిదిద్దాలని ఆదేశించారు. బస్సుల ఫుట్ బోర్డులు కానీ, లోపల సీట్లు వంటివి నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అలానే బస్టాండ్‌లలో మహిళల కోసం కుర్చీలు, టాయిలెట్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మహిళల రద్దీకి అనుగుణంగా సర్వీసులను అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా గ్యారేజ్‌లోని మెకానిక్‌లు, డ్రైవర్‌లు, కండక్టర్‌లు పూర్తిస్థాయిలో కృషిచేస్తే పథకం అమలు సాధ్యమవుతుందన్నారు. త్వరలో 1050 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయన్నారు. అలానే ప్రతి ఏటా డీజిల్ బస్సుల స్థానంలో 1500 నుంచి 2వేల వరకు ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయని ఇప్పటికే సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. ప్రస్తుతం ఉన్న బస్సులతోనే పథకాన్ని అమలు చేయాలని సూచించారు. సమీక్షలో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్, డీపీటీవో సామ్రాజ్యం, జోన్ డిప్యూటీ సీటీఎం రవికాంత్, పలువురు డిపో మేనేజర్‌లు ఉన్నారు.

## ఏఐని విస్తృతంగా వినియోగించాలి

- డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేథ(ఏఐ)ని రైల్వేలోని వివిధ విభాగాల్లో వినియోగించడంపై ప్రతీ ఒక్క అధికారి దృష్టి పెట్టాలని గుంటూరు రైల్వే డీఆర్ఎం సుదేష్ణ సేన్ ఆదేశించారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో రోజువారి పనుల్లో ఏఐ వినియోగంపై అధికారులకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ పనిలో వేగం పెరగడానికి, సులభతరం చేయడానికి ఏఐ పరికరాల వినియోగించాలని సూచించారు. భవిష్యత్తులో ఏఐ ఎన్నో పనులను చేయబోతున్నదని, అందుకు తగినట్లుగా అందరూ సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ 2003 టీచర్స్‌కు పాత పెన్షన్ అమలుచేయాలి

- సీఎస్ విజయానంద్‌కు సంఘం నాయకుల వినతి

గుంటూరు (విద్య), జూలై 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరమ్ నాయ కులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వాల జాప్యం వల్ల డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన వ్య క్తం చేశారు. ఇతర శాఖల ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ పథకాన్ని చేయాలని కోరారు. తమ సమస్యలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎస్ విజయానంద్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, టీచర్స్ ఫోరమ్ ఏపీ నాయకులు మోపిదేవి శివశంకరరావు తదితరులు ఉన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల సంస్థ

# బలోపేతానికి కృషి



ద్రవ జీవామృతంను పరిశీలిస్తున్న డాక్టర్ షేక్ ఎన్ మీరా, ఎం యుగంధర్, పాల్గొన్న రైతులు

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) బలోపేతానికి కృషి చేస్తున్నట్టు ఐకార్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ మీరా అన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర దత్తత గ్రామమైన రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో క్షేత్ర పరిశీలనలో భాగంగా వరి పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయంలో భాగంగా ద్రవజీవామృతంను ప రిశీలించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను ఒకే గొడుగు కిందకు తీసుకురావడమే ఈ సంస్థ లక్ష్యమని అన్నారు. ఈ సంస్థలో చేరేవారి పంటలకు మార్కెటింగ్, సాంకేతిక సదుపాయాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆర్థిక బలంతో పాటు మార్కెటు అనుసంధానం పెంపొందించుకునేందుకు ఈ సంస్థ దోహదపడుతుందన్నారు. అనంతరం మినుములో నూతన వంగడాలను 375 మంది రైతులకు అందించి విత్తన ఉత్పత్తిదారులుగా తయారవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే హెడ్ ఎం యుగంధర్, సీనియర్ శాస్త్రవేత్త ఎం గంగాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



డ్రాగన్ ఫ్రూట్స్ పంట

# లాభాల బాటలో డ్రాగన్ ఫ్రూట్స్

- తక్కువ పెట్టుబడితో అధికలాభం
- డ్రాగన్ ఫ్రూట్స్ పంటకు మొగ్గు చూపుతున్న రైతులు



రైతు మట్టయ్య



గురజాలటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డ్రాగన్ ఫ్రూట్స్ పంట తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎక్కడా మండలంలో డ్రాగన్ ఫ్రూట్ పంటలు లేవు. లాభాలు ఎక్కువగా రావడంతో డ్రాగన్ ఫ్రూట్ పంటకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని పులిపాడులో కొమ్మినేని మట్టయ్య అనే రైతు నాలుగు ఎకరాల్లో గత నాలుగేళ్లుగా డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ పంట వలన వచ్చే లాభాలు, నష్టాలపై మట్టయ్య మాట్లాడుతూ డ్రాగన్ ఫ్రూట్ మొక్క ఎండ 45 డిగ్రీలలో కూడా బతుకుతుందన్నారు. వర్షం ఎక్కువైనా తక్కువైనా మొక్క బతుకుతుందన్నారు. అలాగే డ్రాగన్ ఫ్రూట్ మొక్క నాటినప్పటి నుంచి వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని పంటను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎకరాకు సుమారు రూ.10 లక్షల దాకా ఖర్చు అవుతుందని, మొక్కలు నాటిన తరువాత రెండేళ్లకు కాయ వస్తుందన్నారు. ఎకరాకు సుమారు 15 టన్నుల నుంచి 20 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. 20 యేళ్ల పాటు పంట చేతికి వస్తుందన్నారు. రెండేళ్లలో పెట్టుబడి మొత్తం పోయి లాభాలు తెస్తుందన్నారు. దీంతో మండలంలో పలువురు రైతులు డ్రాగన్‌ఫ్రూట్స్ పంటలు వేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

పల్లెలు పచ్చగా ఉంటేనే కాదు... పల్లెలు ఎంత పరిశుభ్రంగా ఉంటే, ప్రజలు అంత ఆరోగ్యంగా ఉంటారంటూ క్లీన్ విలేజ్ కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వినూత్న రీతిలో శ్రీకారం చుట్టారు. రోజంతా ఒకే గ్రామంలో ఉండి, ప్రతి వీధిలో పర్యటించి, ఎక్కడా పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలనే కొత్త ఆలోచనతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనితోపాటే గ్రామంలోని ప్రజలకున్న సమస్యలను తెలుసుకుంటూ, వాటికీ పరిష్కారం చూపారు. మెగా శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం గుంటూరు జిల్లా తెనాలి మండల పరిధిలోని కొలకలూరు మేజర్ పంచాయతీలో క్లీన్ కొలకలూరు కార్యక్రమాన్ని చేపట్టారు.

# ప్రతి గ్రామం పరిశుభ్రంగా..

- క్లీన్ విలేజ్.. క్లీన్ కొలకలూరుకు మంత్రి మనోహర్ శ్రీకారం
- వినూత్న రీతిలో రోజంతా ఒక గ్రామంలోనే
- అప్పటికప్పుడు పరిష్కారం దిశగా తొలి అడుగు



సీసీ రోడ్డుకు కాలువ లేకపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో మురుగు తీయిస్తున్న మంత్రిమనోహర్

తెనాలిరూరల్, జూలై30(ఆంధ్రజ్యోతి): మురుగు కూపంగా ఉన్న కొలకలూరు గ్రామాన్ని పచ్చదనం పరిశుభ్రతలకు నిలయంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. బుధవారం మండలంలోని కొలకలూరులో మెగా శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టారు. తెనాలి మునిసిపాలిటీ, మండలంలోని పలు పంచాయతీల పారిశుధ్య సిబ్బందితో గ్రామంలోని వీధుల్లో కాలువలు పూడికతీత, బ్లీచింగ్ చిమ్మించడం వంటివి జరిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం 5 గంటలవరకూ సాగింది. మంత్రి మనోహర్ జరుగుతున్న పారిశుధ్య పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా గ్రామంలో బీసీ కాలనీ శానిటేషన్‌లోపంతో కునారిల్లుతుండటాన్ని మంత్రిమనోహర్ గుర్తించారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో శానిటేషన్ అధ్వానంగా ఉంటే మీరేం చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోనే అత్యధికంగా 16వేల మంది జనభా ఉన్న గ్రామంమే ఇంత అధ్వానంగా ఉండటం ఏంటని మండిపడ్డారు. వర్షాలు కురుస్తున్నాయి కాలువల్లో పారుదల కావాల్సిన నీరు రోడ్లపైకి చేరుతున్నాయి. చిన్నారులు, పెద్దలు ఈ నీటిలో నడిచి వెళ్లితే అనారోగ్యసమస్యలు రావా అంటూ అధికారులను నిలదీశారు. తాను వచ్చి చూస్తేనే ఇంత దారుణంగా ఉంటే రోజు ఇక్కడే ఉండే స్థానికుల పరిస్థితి ఏంత బాధాకరంగా ఉంటుందో ఊహించగలనన్నారు. ఇకనైనా నిర్లక్ష్యాన్ని విడనాడాలని సూచించారు. రోడ్డు పొడవునా స్థానికులతో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. తమ కాలనీలో దాదాపుగా ఆరేళ్లుగా పారిశుధ్యం అధ్వానంగా తయారై దుర్భరమైన జీవితం గడుపుతన్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి విచ్చేసిన మంత్రి మనోహర్‌కు ఆ గ్రామ కూటమి నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి దుశాలవాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు.సబ్‌కలెక్టర్ సంజనసింహ, డీపీవో నాగసాయిపవన్‌కుమార్, సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి, ఎంపీడీవో అత్తోట దీప్తి, తహసీల్దార్ గోపాలకృష్ణ, డ్వామా, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ, ఆర్‌డబ్ల్యుఎస్ పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పని చేస్తున్న ఉపాధి కూలీలు

# ఉపాధిలో.. అవినీతికి చెక్

- నిబంధనలు కఠినతరం
- పని ప్రదేశంలో రెండు విడతలుగా హాజరు నమోదు
- శ్రామికుల యాప్‌లో అప్‌లోడ్
- ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

సత్తెనపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం అమల్లోని అవినీతికి అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీని కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ తీసుకు వచ్చింది. ఈ విధానం ద్వారా ఉపాధి కూలీలు ఉదయం, సాయంత్రం పని ప్రదేశంలో ముఖ హాజరు వేసేలా తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దొంగ మస్టర్ల కట్టడికి కేంద్రం మరికొన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయటంతో పాటు సంబంధిత అధికారుల పర్యవేక్షణ బాధ్యతలను పెంచింది. ఉపాధి పథకంలో ఇప్పటి వరకు పనులు చేస్తున్న కూలీలు ఒక్క పూట మాత్రమే పని చేసేవారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు వారిని ఫోటోలు తీసి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా రెండు పూటలా పని చేసినట్లు హాజరు వేసి ఆ ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. అలా పని చేసిన కూలీలకు ఒక పూట మస్టర్ల ఆధారంగానే వేతనాలు చెల్లించే వారు. ఈ క్రమంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు అవినీతికి పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. సామాజిక తనిఖీలు, ఆడిట్‌లు జరుగుతున్నప్పుడు అవినీతి జరిగినట్టు రుజువైతే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌లకు జరిమానాలు విధించే వారు. దీనిని అరికట్టేందుకు ఉదయం పనికి రాగానే ఒక సారి, సాయంత్రం 4 గంటల తరువాత మరో సారి ఫోటోలు తీసి వాటిని నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. శ్రామికుల వేతనాలు చెల్లించేందుకు ఈ ఫోటోలు తప్పనిసరి. లేదంటే ఆ రోజు వేతనం రానట్టే.

### అమలు తీరు ఇలా...

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీసే ఫోటోలను పంచాయతీ కార్యదర్శులకు అప్‌లోడ్ చేయాలి. వాటిని నిరంతరం కార్యదర్శులు పర్యవేక్షిస్తూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌లో ఏపీవోలకు నివేదిక అందజేయాల్సి ఉంది. ఫోటోలు సక్రమంగా తీశారనేది మండల స్థాయి అధికారులు పరిశీలించాలి. మండల పరిధిలో వచ్చిన అన్ని ఫోటోలకు సంబంధించి 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు అందజేయాలి. క్షేత్ర స్థాయిలో రెండో సారి ఫోటోలు తీయని ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్ల పై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు. నూతన మస్టర్ల విధానం అమలుతో కూలీలు తప్పనిసరిగా పని ప్రదేశంలో ఉండాల్సి వస్తుంది.

## విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు రిజర్వేషన్ కోటా సవరణ

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నంబరు 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు రిజర్వేషన్ కోటాని రైల్వే బోర్డు సవరించింది. సెప్టెంబరు 25వ తేదీ నుంచి ఈ సవరణ అమలులోకి రానుంది. ఆ తేదీ నుంచి స్లీపర్‌క్లాస్ బెర్తులు జనరల్ కోటాలో 130, రిమోట్ లొకేషన్ విశాఖపట్టణంలో 70, ఆర్ఎల్ రాజమండ్రిలో 15, తత్కాల్ 72, ప్రీమియం తత్కాల్ 72 బెర్తులకు పెరుగుతాయి. ఏసీ టూ టైర్, ఏసీ త్రీటైర్ ఎకానమిలో మాత్రం బెర్తుల సంఖ్యని కోత పెట్టింది.

# కౌలు చెల్లింపులపై రైతుల ఆగ్రహం

- మ్యుటేషన్ వంకతో చెల్లింపుల నిలుపుదల
- తాజా జాబితాలో మృతుల పేర్లు ప్రత్యక్షం
- ఇంకా 6,114 మందికి 60 కోట్లు బకాయి
- గ్రీవెన్స్ దినోత్సవం రోజు ఆందోళనకు సిద్ధం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల కౌలు చెల్లింపుల తీరుపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. 6 వేలమందికి పైగా కౌలు చెల్లించకుండా ఆపడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. పైపెచ్చు తాజాగా రూపొందించిన జాబితాలో మృతుల పేర్లు కూడా కనిపించడంతో రైతులు అవాక్కవుతున్నారు. జాబితా రూపకల్పనలో సీఆర్డీఏ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రాజధాని కోసం భూసమీకరణ చేపట్టిన సమయంలో రైతులకు పదేళ్లపాటు కౌలు చెల్లించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అయితే వైసీపీ ప్రభుత్వం మూడేళ్లపాటు కౌలు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు చెల్లించింది. తాజాగా మరో ఐదేళ్లపాటు కౌలు చెల్లింపును కూటమి ప్రభుత్వం పొడిగించింది. అయితే కౌలు చెల్లింపు ఇప్పటికే రెండు నెలలు ఆలస్యం అయింది. ఎట్టకేలకు జూలైలో కౌలు వేసినప్పటికీ అందులో 6,114 మందికి రూ.60 కోట్ల మేర చెల్లింపులు ఆపేశారు. రిటర్నబుల్ ప్లాట్లలో ఎంతోకొంత అమ్ముకున్నా, బిడ్డల పేర రాసుకున్నా మ్యుటేషన్ పేరుతో వాటిని అధికారులు పరిశీలనలో పెట్టారు. పదేళ్లగా కౌలు ఇస్తున్న జాబితాలో పేర్లను పరిశీలన పేరుతో ఆపామని సీఆర్డీఏ అధికారులు చెబుతున్నారని రైతులు అంటున్నారు. గతంలో లేని విధంగా ఇప్పుడెలా ఆపుతారంటూ రైతులు నిలదీస్తున్నారు.

**● జాబితాలో మృతుల పేర్లు..**

తాజాగా పెండింగులో పెట్టిన జాబితాను పరిశీలించే క్రమంలో మృతుల పేర్లు వెలుగు చూశాయని రైతులు చెబుతున్నారు. రైతుల సమక్షంలోనే జరిగిన పరిశీలనలో మృతుల పేర్లు రావడంతో అక్కడే వారు అధికారులను నిలేసినట్లు సమాచారం. కాగా రాజధాని రైతుల్లో చాలామంది ప్లాట్లను వారసుల పేర రాసుకున్నారు. ఇలా మ్యుటేషన్ చేయించుకున్న రైతులకు సంబంధించి వారి పిల్లలకే ప్రభుత్వం కౌలు చెల్లిస్తోంది. అయితే తాజా జాబితాలో పిల్లల పేర రాసుకున్నవారి పేర్లు వచ్చాయి. వారిలో చాలామంది చనిపోయి ఉన్నారు. ఇలా చనిపోయిన వారి పేర్లు జాబితాలో తిరిగి ప్రత్యక్షమవడానికి సీఆర్డీఏ అధికారులే కారణమంటూ రైతులు మండిపడుతున్నారు.

**● ఆందోళనకు సిద్ధమవుతున్న బాధితులు**

శుక్రవారం జరిగే గ్రీవెన్స్ రోజున కౌలు విషయమై ప్రశ్నించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రతి శుక్రవారం రాజధానిలో జరిగే గ్రీవెన్స్ స్థానిక అధికారులతో సీఆర్డీఏ తూతూ మంత్రంగా మార్చేసిందని, గ్రీవెన్స్ కార్యక్రమానికి సీఆర్డీఏ అదనపు కమిషనర్ హాజరు కావాలని, అప్పుడే తమ గోడు ప్రభుత్వానికి అర్థమవుతుందని రైతులు అంటున్నారు.

## ఆదాయపన్ను చట్టాలపై అవగాహన ఉండాలి

- ఆదాయపు పన్ను అధికారి ప్రసాద్‌బాబు

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను చెల్లింపుదారులు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ఆదాయపు పన్ను అధికారి బీఏ ప్రసాద్ బాబు తెలిపారు. నగరంపాలెంలోనున్న ఆదాయపు పన్నుశాఖ కార్యాలయంలో బుదవారం బులియన్, గోల్డ్, డైమండ్ వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్ కార్డు ధృవీకరణతో పాటు ఫామ్ 60న దాఖలు చేయటంపై అవగాహన కల్పించారు. అలానే ఫామ్ 61/61 ఏ దాఖలు చేయటంపై కూడా తెలియజేస్తూ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ రిజిష్టర్ చేయటంపై కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐటీ చట్టాల ప్రకారం వ్యాపారులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఇన్ కంటాక్స్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు రాజేంద్రకుమార్‌జైన్, నరసింహరావు, జగన్నాధరావు తదితరులున్నారు.

## మహిళలకు అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటుచేయాలి


- జిల్లా లీగల్‌సెల్ అధికారి విజయలక్ష్మి

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా పదిమందికి పైగా పనిచేస్తారో అక్కడ మహిళలకు అంతర్గత ఫిర్యాదు కమిటీని ఆయా సంస్థలు ఏర్పాటు చేయాలని మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా లీగల్‌సెల్ అధికారి ఎ విజయలక్ష్మీ తెలిపారు. జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన సమావే శంలో ఆమె మాట్లాడారు. ఈ కమిటీ వారు ఆ పని ప్రదేశంలో కనుక మహిళలు ఎవరైనా లైంగిక వేధింపులకు గురైతే తప్పనిసరిగా రాతపూర్వకంగా ఫిర్యాదు స్వీకరించి విచారించి తప్పు చేసిన వారికి చట్టప్రకారం శిక్ష విధించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కమిటీ రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఈ చట్టం ప్రకారం అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీలను ఏర్పాటు చేయకపోతే చట్ట ప్రకారం రూ. 50వేల జరిమానా విధించేలా చట్టంలో ఉందని తెలిపారు. వ్యాపార సంస్థలు తప్పనిసరిగా అంతర్గత కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా చాంబర్ గౌరవ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు మాట్లాడుతూ దుకాణాల యజమానులు చట్టప్రకారం వ్యవహరించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు షరాబు కృష్ణమూర్తి, గొల్లపూడి కాశీ వెంకటరాంబాబు తదితరులున్నారు.

## లారీ కిందపడి

# విద్యార్థి దుర్మరణం

- పొన్నూరు రోడ్డులో హృదయ విదారక ఘటన
- పెన్ కొనుక్కునేందుకు రోడ్డుపైకి రాగా ప్రమాదం



షాహిద్ అహ్మద్ (ఫైల్)

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది నిమిషాల్లో తమ్ముడితో కలసి స్కూలుకు బయలుదేరి వెళ్లాల్సిన విద్యార్థి లారీ కిందపడి దుర్మరణం చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. బుధవారం ఉదయం పొన్నూరు రోడ్డులో జరిగిన ఈ దుర్ఘటనలో ఆనందపేట 9వ లైన్‌కి చెందిన షాహిద్ అహ్మద్ (13) మృతి చెందాడు. ఈస్ట్ ట్రాఫిక్ సిఐ అశోక్ కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు రోడ్డులోని ఆనందపేటకి చెందిన షేక్ షబ్బార్ ఆటోనగర్లో కారు మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఇరువురు కొత్తపేటలోని భాష్యం స్కూల్లో చదువుతున్నారు. బుధవారం ఉదయం సుమారు 6 గంటల 45 నిమిషాల సమయంలో వారు స్కూలుకు వెళ్లేందుకు రెడీ అయ్యారు. 9వ తరగతి చదివే పెద్ద కుమారుడు షేక్ షాహిద్ అహ్మద్ పెన్ లేకపోవడంతో కొనుక్కునేందుకు ఇంట్లో ఉన్న స్కూటీతో బయటికి వెళ్లాడు. పొన్నూరు రోడ్డు మీదుగా షాపునకు వెళ్తుండగా ఎస్ఆర్ ఫుడ్ కోర్టు ఎదురుగా వచ్చేసరికి వెనుక నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేసే లారీ వెళ్తోంది. అదే సమయంలో రోడ్డుపై ఎడమ పక్కన మున్సిపల్ చెత్త బండి నిలబెట్టారు. ఎదురుగా రాంగ్ రూట్లో ఆటో ఎదురొచ్చింది. ఆటో ఎదురుగా రావడంతో ద్విచక్ర వాహనం ఆటోను ఢీకొంటుందనే కంగారులో షాహిద్ అహ్మద్ తన స్కూటీ వెనుక బ్రేకుతోపాటు ముందు బ్రేకు కూడా నొక్కాడు. ఆటో సమీపానికి వెళ్లి ఒక్కసారిగా స్కూటీ ముందు చక్రం అదుపుతప్పి కుడివైపు పడింది. అదే సమయంలో వెనుక నుంచి రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ వెనుక టైర్ కింద షాహిద్ పడిపోయాడు. టైరు షాహిద్ పైకి ఎక్కడంతో అక్కడికక్కడే కన్నుమూశాడు. మరి కొద్ది నిమిషాల్లో అన్నదమ్ములు ఇరువురు స్కూలుకు వెళ్తారనుకున్న తరుణంలో కుమారుడు షాహిద్‌ను మృత్యువు కబళించిందనే వార్త తెలిసిన వెంటనే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కుప్పకూలిపోయారు. షాహిద్ మరణ వార్త స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి
- నరసరావుపేట మండలం ములకలూరు వద్ద ఘటన

నరసరావుపేట రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలూరు గ్రామం వద్ద బుధవారం రాత్రి రెండు మోటార్ సైకిల్స్ ఢీకొన్నాయి. సత్తెనపల్లి నరసరావుపేట ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం ములకలూరు వద్ద రెండు మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొనగా మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడ్డారు. వెనుక నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం వారిపై నుండి వెళ్లడంతో మృతి చెందారు. సత్తెనపల్లి గ్రామానికి చెందిన నాటకం రాకేష్ (34), షేక్ బాజీ (35) అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై కిషోర్ తెలిపారు.

## అంగన్‌వాడీల జీతాలు పెంచాలి

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షురాలు రమణ డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరు పశ్చిమ అంగన్వాడీల సమావేశంలో ఆమె ప్రసంగించారు. గత ప్రభుత్వంలో జరిగిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను నేటివరకు నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు 90శాతం పైగా పనిచేయడం లేదని దీనికి నిరసనగా ఆగస్టు 4న జిల్లాలో ఉన్న అంగన్‌వాడీలందరూ తమ ఫోన్లను సిడిపివోలకు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలుచేస్తూ జీవో ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఆర్భాటంగా ప్రకటించారని, ఆ జీవో ఇంతవరకు అమలుచేయలేదని అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా జరిగే రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో అంగన్వాడీలు, ఇతర చిరుద్యోగులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణ, పాల్గొన్న అంగన్‌వాడీలు

## ఉత్సాహంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు'

● పాటిమీదపాలెంలో పర్యటించిన ఎమ్మెల్యే బీఎన్



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, జూలై30(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం బుధవారం సాయంత్రం చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని పాటిమీదపాలెంలో ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఇంటింటా తిరుగుతూ ఏడాదిపాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, పాపిరెడ్డి, శివపార్వతి, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, తాతినేని రాము తదితరులు పాల్గొన్నారు.

## వ్యాక్సినేషన్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కమలశ్రీ

నాగులుప్పలపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వాక్సినేషన్‌లో వైద్యఆరోగ్య సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్మ్యునిజేషన్ అధికారి కమలశ్రీ సూచించారు. మండల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలల సిబ్బందితో నాగులుప్పలపాడు ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు తప్పనిసరిగా రెండు టీటీ ఇంజక్షన్లు అందించాలని సూచించారు. శిశువులకు టీకాలు తప్పనిసరిగా అందించాలన్నారు. పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భిణీలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి ఐరన్‌మాత్రలు అందించాలన్నారు. మూడు సార్లు ప్రభుత్వ వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకునేలా చూడాలని, ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్, ప్రసన్న, కుమారస్వామి, ఒనారియల్, హెల్త్ సూపర్‌వైజర్ శౌరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు సబ్ డివిజన్ ఉద్యానశాఖ అధికారి సంధ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నీటి వసతి, బిందు సేద్యం ఉన్న రైతులు అయ్యే ఖర్చులో 40 శాతం సబ్సిడీగా ఇస్తారని, అందులో 60 శాతం మొదటి సంవత్సరం 40 శాతం రెండో సంవత్సరం బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తారన్నారు. పండ్ల తోటలకు ఇచ్చే రాయితీలు కూడా ఆమె వివరించారు. హైబ్రిడ్ కూరగాయలకు ఎకరాకు రూ.9600, బంతి, చామంతి, మల్లెతోటలకు ఎకరాకు రూ.8వేలు చొప్పున రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ ఆధారితమైన సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్ రూములు, కోల్డ్ రూమ్, సోలార్ పవర్ కోల్డ్ రూమ్‌లో మొదలైన వాటికి 35 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు రైతులు దరఖాస్తు చేసుకోవడానికి పాసు పుస్తకంతో ఉద్యానశాఖ కార్యాలయాన్ని సోమ, గురువారాల్లో సంప్రదించాలని, వివరాలకు 7995009758 సెల్‌నెంబరులో సంప్రదించాలని కోరారు.

## శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయం

ఒంగోలు కల్చరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయమని ప్రముఖ వాస్తు, జ్యోతిష్య పండితుడు అగస్త్యరాజు శివసుబ్రహ్మణ్యశర్మ ఉద్బోధించారు. త్రేతాయుగంలో మానవ రూపంలో జన్మించి మనుషుడు అనుసరించాల్సిన ధర్మం, జీవన విధానాన్ని ఆచరణలో చూపిన శ్రీరామచంద్రుని జీవితాన్ని కలియుగంలో అందరూ పాటించాలని పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీలలితాశ్రమంలో ఆయన శ్రీరామవైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవజీవితం సాఫల్యం కావడానికి ఇహపర సౌఖ్యాలు పొందటానికి శ్రీరాముని ఆరాధన, శ్రీరామనామ జపం ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శ్రీరామదాసు, త్యాగయ్య, పోతన వంటి వారు శ్రీరాముని కీర్తించారని వివరించారు. అనంతరం శివసుబ్రహ్మణ్య శర్మను ఆశ్రమ నిర్వాహకురాలు మాతా విజ్ఞానందసరస్వతి సత్కరించారు.

## ఏడాదైనా.. ఎక్కడివక్కడే..!

(5వ పేజీ తరువాయి)

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన గ్రామసభలు, రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులు దాదాపు 5,600. నేతలు క్రమం తప్పకుండా ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రజాదర్బార్‌లు సరేసరి. మొత్తం అర్జీల పరిశీలనలో ఒకే సమస్యపై అదే వ్యక్తి దపదఫాలుగా అర్జీల రూపంలో ఇచ్చినవి దాదాపు 950 వరకు ఉన్నట్లు యంత్రాంగం గుర్తించింది. రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీనే తిరిగి పీజీఆర్ఎస్‌కు రావడం ఒక ఎత్తయితే గ్రామ సభల్లో ఇచ్చినదానినే, మళ్లీ నేతల ప్రజాదర్బార్‌లో ఇవ్వడం ఇలాంటివి పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇందులో కొన్ని అధికారులు తిరస్కరించినా సరే ఇంకో వేదికమీదకు దానిని తీసుకెళుతుండడంతో అర్జీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇది కాకుండా సమస్య పరిష్కారం కాకపోవడం కూడా బాధితులు ఒకే అర్జీని అనేక వేదికలపై ఇస్తూ వస్తున్నారు

### యంత్రాంగం నిర్లక్ష్యం కూడా కారణమే...

పెద్ద సంఖ్యలో రెవెన్యూ అర్జీలు వస్తుండడం, ఉన్న సిబ్బంది తక్కువగా ఉండడంతో వాటి డిస్పోజ్ ప్రణాళికబద్ధంగా జరగడం లేదని తెలుస్తోంది. పైగా అర్జీల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగానికి టార్గెట్లు పెడుతుండడంతో కేవలం గణాంకాలకే ప్రాధాన్యం ఇస్తూ, మమ అనిపించే విధంగానే ఈ తంతు జరుగుతుండడంతో అర్జీల పరిష్కారం ఎండమావిగానే మిగులుతోందని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. గ్రామసభలు, రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను, పీజీఆర్ఎస్‌తో అనుసంధానం చేసినట్లు యంత్రాంగం చెబుతోంది. అన్నీ కలిపి దాదాపు 9,000 రెవెన్యూ అర్జీలను డిస్పోజ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ వాటికి సంబంధించి విడివిడిగా గణాంకాలు అడిగితే లేవనే సమాధానమే సదరు వ్యవస్థల వద్ద నుంచి వస్తుండడంతో ఈ ప్రక్రియ ఎంత లోపభూయిష్టంగా జరుగుతుందో అర్థమవుతోంది

### ఇక రీసర్వే మరో ప్రహసనం

గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో అనేక తప్పిదాలు జరిగాయి. వాటన్నింటిని సరిదిద్దడంతో పాటు ఈ ప్రభుత్వం మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసుకుని రెండు ఫేజ్‌లుగా రీ సర్వే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇది నెలల తరబడి సాగుతున్నా ఇప్పటికీ తొలి దశలో చేపట్టిన 25 గ్రామాలకు సంబంధించే ఫైనల్ ఆర్ఎల్ఆర్ సిద్ధం కాకపోవడం ఇది ఏ రీతిన సాగుతుందో తేటతెల్లం చేస్తోంది. పైగా రీసర్వే దాదాపు కొలిక్కి వచ్చిందని అధికారులు చెబుతున్న గ్రామాల నుంచే పదుల సంఖ్యలో అర్జీలు వస్తుండడం విస్మయపరిచేదిలా ఉంది. సిబ్బంది తక్కువగా ఉండడం వలన రీసర్వే వేగంగా జరగడం లేదనేది అధికారుల మాటగా ఉంది

కేవలం అంకెల్లోనే పరిష్కారం చూపే మొక్కుబడి తంతుకు రెవెన్యూ యంత్రాంగం స్వస్తి పలికి సమస్యకు ముగింపు పలకడానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తేనే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుంది. లేకుంటే మరో నాలుగేళ్లు గడిచాక కూడా ఇదే స్థాయిలో రెవెన్యూ అర్జీలు వచ్చినా ఆశ్చర్య పోనవసరం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

## కొప్పోలు రోడ్డులో డ్రైనేజీ పనులు ప్రారంభం

● హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



పులివెంకటరెడ్డికాలనీ జరుగుతున్న సైడుకాలువ నిర్మాణ పనులు

ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేషన్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పులివెంకటరెడ్డికాలనీ వద్ద తవ్వకాలు చేపట్టారు. అయితే ఈ సైడుకాలువల నిర్మాణం చేసేందుకు రోడ్డు ఆక్రమణలో ఉన్న కట్టడాలకు అధికారులు గతంలో నోటీసులు ఇచ్చారు. కేవలం 10అడుగులు మాత్రమే అక్రమ కట్టడాలను తొలగించారు. మొత్తం మీద 20 అడుగులు ఆక్రమణలు ఉండగా, ఆక్రమణదారులు ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరుపుకుని పది అడుగుకులకు తగ్గించారు. ఈక్రమంలో సైడు కాలువల నిర్మాణాలకు రూ.2కోట్లు కేటాయించగా ఎట్టకేలకు పనులు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

## సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు

● కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశం



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విధుల్లో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన ఇరువురు సచివాలయ సెక్రటరీలకు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బుధవారం నగరంలోని పేర్నమిట్ట, అన్నవరప్పాడు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలో, అలాగే పేర్నమిట్ట వద్ద అంబేద్కర్ కాలనీలో పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సమయంలో హౌసింగ్ బోర్డు కాలనీలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా అక్కడే తగలబెట్టడాన్ని గుర్తించిన కమిషనర్ ఏరియా శానిటరీ సెక్రటరీ, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్నమిట్ట సచివాలయంలో సిబ్బంది హాజరుపట్టికలో సంతకం చేయకపోవడంతో పాటు ఫీల్డు పేరుతో మరికొందరు గైర్హాజరు కావడాన్ని గుర్తించిన కమిషనర్ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటంపై వారిపై చర్యలు తీసుకోవాలని గుమస్తాకు ఆదేశించారు. అనంతరం పీ4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాల ఎన్ని ఉన్నాయి, ఎంతమందిని దత్తతకు గుర్తించారనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు.

## పేద విద్యార్థికి కమ్మవారి సేవా సంఘం చేయూత

● స్కూలులో చేర్పించిన సభ్యులు



మధులోకేష్‌ను స్కూలులో చేర్పిస్తున్న సంఘ సభ్యులు

ఒంగోలు(రూరల్)/చీమకుర్తి, జూలై30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామానికి చెందిన పేద విద్యార్థి చల్లా మధులోకేష్‌కు కమ్మవారి సేవాసంఘం తరపున ఉచిత విద్యాసౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమ్మవారి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఒంగోలులోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధులోకేష్‌కు తల్లిదండ్రులు లేరని, ఆ కుటుంబ సభ్యులు పేదరికంతో చదివించటానికి ఎవరూ ముందుకు రాలేదని, దీంతో బంధువులు కమ్మవారి సేవా సంఘాన్ని ఆశ్రయించారని పేర్కొన్నారు. సంఘం సభ్యులు నిర్ణయం మేరకు ఆ విద్యార్థి చదువుకు అయ్యే ఖర్చులు భరించటానికి అంగీకరించారు. 9వ తరగతి చదువుతున్న మధులోకేష్‌ను చీమకుర్తిలోని చీమకుర్తి పబ్లిక్ స్కూల్‌లో చేర్పించారు. ఉచిత విద్య, హాస్టల్ సౌకర్యం, పుస్తకాలు, దుస్తులు, ఇతర ఖర్చులు భరించటానికి తీర్మానించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అలా హనుమంతరావు, ఐకే డోనర్స్ క్లబ్ చైర్మన్ పాటిబండ్ల వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు కరిచేటి చంద్రశేఖర్, అంగలకుర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణకు విరివిగా రుణాలు

● ఎస్‌బీఐ ఆర్ఎం అప్పలరాజు



ఎస్‌బీఐ నూతన భవన భూమిపూజలో పాల్గొన్న ఆర్ఎం అప్పలరాజు

కొండపి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణకు ఎస్‌బీఐ విరివిగా రుణాలు అందిస్తున్నదని బ్యాంకు కందుకూరు ఆర్ఎం వి.అప్పలరాజు అన్నారు. బుధవారం కొండపిలోని టంగుటూరు రోడ్డులో బ్యాంకు నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొండపి ఎస్‌బీఐ (వ్యవసాయాభివృద్ధి శాఖ)లో 1,800 మంది రైతులకు పంట రుణాలు అందించామన్నారు 256 డ్వాక్రా గ్రూపుల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు చేయూత నిస్తున్నదన్నారు. 'అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్' పథకంలో రైతులకు ట్రాక్టర్లు, అనుబంధ యంత్రాలు, డ్రోన్లకు రుణాలిస్తున్నామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎం కార్యాలయ మేనేజర్ (హెచ్‌ఆర్) శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బీఐ బీఎం శరత్, పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## వృద్ధాప్య తల్లిదండ్రులను జాగ్రత్తగా చూడాలి

● డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు సమాజానికి అనుభవ గనులని జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, స్టేట్ రూల్స్-2011పై రీజనల్ రిసోర్స్ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిడ్డలు తమ ఆస్తులను తీసుకున్నారే కానీ తమ పోషణ పట్టించుకోవడం లేదని ఇటీవల కాలంలో గ్రీవెన్స్‌లో పలు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. సమాజంలో ఇలాంటి ధోరణి మంచిదికాదన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యతప్రతి ఒక్కరిపై ఉందని, వారి పోషణ, సంరక్షణ విస్మరించడం సరికాదన్నారు. చట్ట ప్రకారం అలా చేయడం శిక్షార్హమైన నేరమన్నారు. ఆయా చట్టాలపై జిల్లా అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు సువార్త, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, రీజనల్ రిసోర్స్ శిక్షణ కేంద్రం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఖరారు

**2న దర్శి మండలం తూర్పువీరాయపాలెంకు రాక**

**అన్నదాత సుఖీభవ ప్రారంభం**

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, గొట్టిపాటి లక్ష్మి**



ఒంగోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన ఖరారైంది. ఆయన వచ్చే నెల 2న దర్శి మండలం తూర్పువీరాయపాలెం వస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆగ్రామంలో జరిగే సభలో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన స్థలాన్ని బుధవారం సాయంత్రం జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆ ప్రాంతంలో పర్యటించి ఖరారు చేశారు. 2వ తేదీ ఉదయం 11 గంటలకు వీరాయపాలెం చేరుకునే సీఎం సాయంత్రం నాలుగు గంటల వరకూ అక్కడే ఉంటారు. తొలుత అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభిస్తారు. అనంతరం నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యకర్తల సమావేశానికి హాజరవుతారు. గతానికి భిన్నంగా ప్రస్తుతం భారీ బహిరంగ సభలకు స్వస్తి చెప్పి పరిమిత సంఖ్యలో ఆయా వర్గాల ప్రజలతో ఇష్టాగోష్టి తరహాలో సమావేశాలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవాన్ని కూడా అలానే నిర్వహించనున్నారు. దీంతో కార్యక్రమానికి ఎంపిక చేసిన తూర్పువీరాయపాలెం గ్రామానికి చెందిన వారితోపాటు పరిమిత సంఖ్యలో పరిసర గ్రామ ప్రాంత రైతులతో సభ నిర్వహించాలని నిర్ణయించారు.

### సీఎంవో అధికారుల జూమ్ కాన్ఫరెన్స్

కార్యక్రమ నిర్వహణపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌లతో బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆ ప్రకారం హెలీప్యాడ్, రైతుల సభ, కార్యకర్తల సమావేశం అన్నీ దగ్గరదగ్గరగా ఒకే ప్రాంతంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయనుండగా ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం రాత్రి సంబంధిత జిల్లా అధికారులతో మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా తూర్పువీరాయపాలెంలో సమీక్ష చేసి తగు ఆదేశాలు ఇచ్చారు.

### యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటనకు కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లకు యంత్రాంగం సిద్ధమైంది. గురువారం ఉదయం నుంచి అక్కడ ఏర్పాట్లు ప్రారంభంకానున్నాయి. తొలుత తూర్పువీరాయపాలెంతోపాటు రాజంపల్లి, దర్శి శివారులోని శివరాజునగర్, ఇతర మరికొన్ని ప్రాంతాలను పరిశీలించిన ప్పటికీ ముఖ్యమంత్రి కార్యాలయ సూచనలకు అనుగుణంగా కార్యక్రమ నిర్వహణకు తూర్పువీరయపాలెం అనువుగా ఉంటుందని భావించి అక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, పలువురు జిల్లా అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

## విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకిటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిచయం లేని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాళ్లు ఇచ్చే పదార్థాలు తీసుకోవడం, మాయమాటలు నమ్మి వారి వెంట వెళ్లడం వంటివి చేయకూడదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక రాజీవ్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు హెచ్ఎం రామయ్య అధ్యక్షతన నిర్వహించారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

అద్దంకిటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన పాలపర్తి వెంకట్రావు అనే వ్యక్తినుంచి దేవరకొండ గోపి అనే యువకుడు (మార్కాపురం సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్) ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.5.36 లక్షలు తీసుకున్నాడు. పెద్ద మనుషుల ద్వారా లక్ష రూపాయలు తిరిగి ఇచ్చాడు. మిగిలిన డబ్బులు అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని వెంకట్రావు అద్దంకి పోలీసుతకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహ తెలిపారు.

## ఒంగోలులో యువకుడి ఆత్మహత్య

ఒంగోలు క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం సుజాతనగర్ ఒకటో లైనులో దుద్దుకూరు బాలకృష్ణ(36) అనే యువకుడు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు బాలకృష్ణ బేల్దారి పనులకు వెళుతుంటాడు. ఇటీవల ఆయన హైదరాబాద్ వెళ్లి ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో సాయంత్రం భార్య, కుమారుడు బయటకు వెళ్లగానే బాలకృష్ణ వరండాలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి షరీఫ్

ఒంగోలు విద్యజూలై 30 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా అనేది వ్యవస్థీకరణ నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ షరీఫ్ పేర్కొన్నారు. ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. మానవ అక్రమ రవాణా అనేది నేరమన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కల్యాణి మాట్లాడుతూ పిల్లలు ప్రలోభాలకు లోనుకాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఇందిర, బి.శ్రావణి, శ్రీనివాసులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాంస్కృతిక స్మారక చిహ్నాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో సాంస్కృతిక స్మారక చిహ్నాలు, ప్రదేశాల పునరుద్ధరణపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానం ఇస్తూ దేశంలో భారత పురావస్తు సర్వే సంస్థ పరిధిలో రక్షిత స్మారక చిహ్నాలు, ప్రదేశాలు 3,685 ఉన్నాయన్నారు. నిర్ణీత సమయాలలో ఈ సంస్థ తనిఖీలు నిర్వహించి ప్రస్తుత అవసరాన్ని బట్టి వాటి పరిరక్షణకు, నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 2020-21లో రూ.4.57కోట్లు, 2021-22లో రూ.5.75 కోట్లు, 2023-24లో రూ.14.70కోట్లు, 2024-25లో రూ.6.50 కోట్లు కేటాయించి ఖర్చుచేసినట్లు కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

## వర్షంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురవడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత 15 రోజుల నుంచి భూములు దుక్కులు దున్ని పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యాయి. అప్పటి నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు గురువారం రాత్రి మద్దిపాడు మండలంలో 6 సెం.మీ వర్షం కురిసింది. ప్రధానంగా మిరప, పత్తి, జొన్న, జనుము, మినుము, పిల్లిపెసర సాగుకు రైతులు సమాయాత్తమవుతున్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

టంగుటూరు (కొండపి), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టాలని, కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి సువర్ణ సూచించారు. కిశోర వికాసంలో భాగంగా కొణిజేడు హైస్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల రక్షణకు అనేక చట్టాలున్నాయని అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం అధికారి లక్ష్మి, స్కూల్ హెచ్ఎం చల్లా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 4 నుంచి నంద్యాలలో శిక్షణ తరగతులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో ఆగస్టు 4 నుంచి 6వతేదీ వరకు నంద్యాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి విజ్ఞాన, వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ ప్రాంగణంలో శిక్షణ తరగతుల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని గత 50 ఏళ్ళ నుంచి పీడీ ఎస్‌యూ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిసింద్రీబాబు, జిల్లా అధ్యక్షుడు శ్యామ్, సచిన్, యూనివర్శిటీ నాయకుడు హరిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకుతో ఆరోగ్యానికి అనర్థం

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పొగాకు వల్ల ఆరోగ్యానికి తీవ్రమైన అనర్థం ఉంటుందని స్టేట్ ఫార్మసిస్ట్ సంఘం నాయకుడు ఎంపీ.రత్నకుమార్ పేర్కొన్నారు. బుధవారం బసవన్నపాలెంలోని పొగాకు కంపెనీల వద్ద కూలీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పొగాకు వల్ల లంగ్స్ దెబ్బతింటాయని, కూలీలు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

## జలాశయాల గణన చేపట్టాలి

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సాగునీటి సౌకర్యాలను అందించటానికి మండలంలో ఉన్న జలశయాల గణన చేపట్టాలని డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జలాశయాలు, చిన్నతరహా నీటి వనరుల గణన ప్రతి ఐదు సంవత్సరాలకు కేంద్రం నిర్వహిస్తుందన్నారు. గ్రామంలో ఉన్న భూగర్భ జలవనరులు, జలాశయాల గణనను చేపట్టాలని వీఆర్వోలకు సూచించారు. దీని వల్ల ప్రభుత్వం సాగునీటికి సంబంధించిన కార్యక్రమాలకు ఉపయోగపడుతుందన్నారు. తహసీల్దార్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ సర్వేని యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఏవో స్వర్ణలత మాట్లాడుతూ వీఆర్వోలను సమన్వయం చేసుకుని గ్రామ వ్యవసాయ సహాయకులు ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో విజయలక్ష్మి, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

## బిరబిరా.. కృష్ణమ్మ

(5వ పేజీ తరువాయి)

జలవనరుల శాఖ చర్యలు చేపట్టింది. గంట గంటకు సాగర్ నుంచి ప్రవాహం పెరుగుతుందని పులిచింతల ప్రాజెక్టు డీఈ వెంకట్ తెలిపారు. తాడువాయి వద్ద మత్స్యకారుల పడవలు ఒడ్డుకు చేరాయి. నదీ తీరాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తహసీల్దారు శ్రీనివాసరావు తెలిపారు.

### లంకలకు పొంచి ఉన్న ముప్పు..

కృష్ణానదికి వరద నీరు పోటెత్తుతుండటంతో లంక గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. గత ఏడాది భారీ వరదల నుంచి తేరుకున్న రైతులను ఈ ఏడాది కూడా వరద భయం వెంటాడుతోంది. కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని నదీ పరివాహక ప్రాంతంలో సుమారు 35 గ్రామాల్లో 20 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులు వరద నుంచి రక్షించాలని కృష్ణమ్మను వేడుకుంటున్నారు. బుధవారం రాత్రి 3 లక్షల పైచిలుకు క్యూసెక్కులు విడుదల చేస్తారని అధికారులు ప్రకటించడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### బాపట్ల కలెక్టర్ సమీక్ష

కృష్ణానది వరద నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బుధవారం కొల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రాణనష్టం జరగకుండా పని చేసినట్లు ఇప్పుడు కూడా యంత్రాంగం పని చేయాలన్నారు. కరకట్ట బలహీనంగా ఉన్నచోట్ల ఇసుక బస్తాలతో పటిష్టపరచాలన్నారు. బియ్యం, నిత్యావసరాలు, పడవలు, ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని కొన్ని ప్రాంతాలు వరద ప్రభావితం అవుతాయన్నారు. గతం కంటే మెరుగుగా అధికారులు పని చేసి ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు.

- సత్రశాలలోని టెయిల్‌పాండ్‌లో 14 గేట్ల ద్వారా 2,94,109 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువన సాగర్ నుంచి 2 లక్షల 91 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా రిజర్వాయర్‌లో 6.337 టీఎంసీల నీరుంది. 74.39 మీటర్లు అంటే 247.70 అడుగులకు ఇది సమానం.
- బుధవారం సాయంత్రం పులిచింతల ప్రాజెక్టులో 41.58 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 3,01,167 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 13,600 క్యూసెక్కులు, 12 గేట్ల ద్వారా 2,84,561 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులను విడుదల అవుతుంది.

## అవీ.. ఇవీ



కారంచేడు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎం హెచ్‌వో డాక్టర్ విజయమ్మ

### మెరుగైన వైద్యసేవలు అందించాలి

● డీఎంహెచ్‌వో విజయమ్మ

కారంచేడు(పర్చూరు), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ అన్నారు. బుధవారం కారంచేడు ప్రభుత్వ వైద్యశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆసుపత్రిలో వసతులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని, డెలివరీలు పెంచేవిధంగా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ పృధ్వీరాజ్, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అక్కా చెల్లెళ్లను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

### తైక్వాండో పోటీల్లో అక్కా చెల్లెళ్ల సత్తా

● ఒకరికి కాంస్యం, మరొకరికి రజిత పతకాలు

వేటపాలెం(చీరాల), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ఓపెన్ తైక్వాండో పోటీల్లో వేటపాలెం ప్రభుత్వ పాఠశాలకు చెందిన అక్కా చెల్లెళ్లు సత్తా చాటారు. వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన యార్లగడ్డ లక్ష్మీప్రియ, లాస్య ప్రియలు ఈనెల 25 నుంచి 27 వరకు విజయవాడలో జరిగిన పోటీల్లో పాల్గొని ఒకరు కాంస్య, మరొకరు రజిత పతకం సాధించారు. ఈసందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇరువురిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ సరోజని, పీఈటీ దేవభిక్షం, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



ఆరికట్లవారిపాలెం సమీపంలో రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు

### చిల్లచెట్లతో మూసుకుపోయిన రహదారి

పంగులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి):చిల్లచెట్లతో రహదారులు మూసుకు పోవడంతో ప్రమాదం పొంచిఉంది. పంగులూరు నుంచి ఇంకొల్లు వైపు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిలో పంగులూరు, ఆరికట్లవారిపాలెం, గంగవరం గ్రామాల మధ్య పలుచోట్ల చిల్లచెట్లు ఇరు వైపుల నుంచి రోడ్డును కమ్మేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. చిల్లచెట్లతో రహదారి మూసుకుపోవడంతో వాహనచోదకులు ఎదురు వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారిలో రోడ్డును మూసేస్తున్న చిల్లచెట్లను తొలగించి ప్రమాదాలబారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలని వాహనచోదకులు వేడుకుంటున్నారు.



# రైతులు పండించిన పొగాకంతా కొనుగోలు చేస్తాం

● చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తంను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. సంతమాగులూరు మార్కెట్ యార్డు లో పొగాకు కొనుగోలు కేంద్రా న్ని ఆర్డీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు తమకు నిర్ధేశించిన సమాయానికి పొగాకును తీసుకుని వచ్చి అమ్ముకోవాలన్నారు. గ్రేడ్‌ల వారీగా పొగాకును తీసుకు రావాలన్నారు. నిబంధనల మేరకు పొగాకును కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ పరిశీలనలో మార్కెట్ యార్డు ఛైర్మన్ తేలప్రోలు రమేష్, తహసీల్దార్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



సంతమాగులూరు మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

### రైతులు అధైర్యపడవద్దు

చినగంజాం :నల్ల బర్లీ పొగాకు రైతులు అధైర్యపడొద్దని, చివరి ఆకు వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మిలు అన్నారు. చినగంజాంలోని పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్‌లోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వారు సందర్శించి రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ జె.ప్రభాకరరావు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, పొగాకు కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. చింతగుంపల్లె పీఏసీఎస్ సీఈవో జి.శేఖర్, పొగాకు బయ్యర్లు, బాపట్ల పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి కే. శ్యాంబాబు పాల్గొన్నారు.

## రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

పంగులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి):అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉన్న రైతులు రైతుసేవా కేంద్రాలలో ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కేవైసీ చేయించుకోని వారి జాబితా రైతుసేవా కేంద్రాలలో ఉన్నదని, 221 మంది రైతులు చేయించుకోవాల్సి ఉందని ఏవో తెలిపారు. పథకం లబ్ధి పొందే రైతులు తమ బ్యాంక్ ఖాతాను ఆధార్‌తో లింక్ చేసే ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలని సూచించారు. పంటసాగులో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బత్తుల వెంకటరావు, రావుల సింగరకొండ, చింతల సహదేవుడు, గడ్డం నాగేశ్వరరావు, గుంటుపల్లి రాధాకృష్ణ, వ్యవసాయ సహాయకులు పవిత్ర, రోజి, రైతులు పాల్గొన్నారు.

### చినగంజాంలో

చినగంజాం : మండలంలోని సంతరావూరు, గొనసపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో మండల వ్యవసాయాధికారి ఆర్. చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైన ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. రైతుల తమ బ్యాంకు అకౌంట్ల నెంబర్లకు ఎన్‌పీసీఐ యాక్టీవ్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



చినగంజాం : పొలం పిలుస్తోంది గ్రామ సభలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్

### విత్తనాలు కొనేటప్పుడు తప్పని సరిగా బిల్లు తీసుకోవాలి

ఇంకొల్లు: రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా బిల్లు పొందాలని మండల వ్యవసాయాధికారి మేరమ్మ అన్నారు.లైసెన్సు ఉన్న దుకాణాలలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.బుధవారం మండలంలోని భీమవరం,కొణికి గ్రామాలలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఆమె సూచించారు.

## సైబర్ నేరాలపై జాగ్రత్తలు సూచించండి

● డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులోని ఖాతాదారులకు సైబర్ నేరాలపై కచ్చితమైన జాగ్రత్తలు సూచించి నేర నియంత్రణకు సహకరించాలని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. బుధవారం పట్టణంలోని బాపనమ్మ కల్యాణ మండపంలో అన్ని బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు పరిసరాల్లో సీసీ కెమెరా పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. అలాగే సెక్యూరిటీ పరమైన అంశాలపై పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్, ఇతర బ్యాంకుసేవలు వినియోగించుకునే ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు.



సైబర్ నేరాలపై మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ మొయిన్

అలాగే బ్యాంకు అధికారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐలు శేషగిరిరావు, నాగభూషణం, ఎస్సైలు చంద్రశేఖర్. జనార్దన్, రాజ్యలక్ష్మి, వాణీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ

మార్టూరు, జూలై30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర్ కాలనీలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రోటరీ క్లబ్ సభ్యులు విద్యార్థులకు భోజనప్లేట్లను, గ్లాసులను ఎంఈవో వస్రాం నాయక్ పంపిణీ చేశారు. అదేవిధంగా స్కూలుకు 4 కుర్చీలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎం సాంబ శివరావు, జీహెచ్ నాగేశ్వరరావు,రావి అంకమ్మ చౌదరి, కె. హనుమంతరావు, చెరుకూరి అంజిబాబు, జాష్టి అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ కోత

మండలంలోని కోనంకి విద్యుత్ ఉపకేంద్రంలో పవర్ ట్రాన్స్‌ఫార్మ్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు మార్టూరు సబ్ డివిజన్ డీఈఈ ఎం.సురేంద్రబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోనంకి పరిధిలోని కోనంకి, జొన్నతాళి,వలపర్ల, ఇసుకదర్శి, బొబ్బేపల్లి, చిమ్మిరిబండ గ్రామాలలో గృహ,వాణిజ్య, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ కోత ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## విధులలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డ్రాపౌట్స్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన విద్యాలయంలో విధులలో ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు అని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ(డిప్యూటీ కలెక్టర్) నాగిరెడ్డి హెచ్చరించారు. బుధవారం బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఏపీసీ తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను అయన పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ట్యాబ్‌ల ద్వారా ఎలా చదువుతున్నారు అని అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనకబడి ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ రవినాయక్ పాల్గొన్నారు.



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలంలో విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ (డిప్యూటీ కలెక్టర్) నాగిరెడ్డి

### దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి

చీరాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల సబ్ డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారం కోరుతూ పోలీసులను ఆశ్రయించే వికలాంగ బాధితులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. బుధవారం డీఎస్పీ ఎండీ మొయిన్‌ను కలిసి కాలేషా మాట్లాడారు. స్టేషన్‌లకు వచ్చే వారి పట్ల ప్రేమగా మెలగాలని, వీల్ ఛైర్‌లు, ర్యాంపులు ఏర్పాటు చేసి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఎస్పీ వెంటనే సమస్యలపై పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు. కాలేషా వెంట పలువురు వికలాంగులు ఉన్నారు.

## సెయింట్ ఆన్స్‌కు అటల్ ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ గ్రాంట్ మంజూరు

చీరాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్‌ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు అటల్ ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ గ్రాంట్ మంజూరయినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. తద్వారా ఫోరెన్సిక్ సైబర్ సెక్యూరిటీ, కాన్సెప్ట్ రీసెర్చ్, ట్రెండ్స్ అండ్ ప్రాసెస్, చాలెంజెస్, పాలసీ అండ్ కాంపిటెన్స్‌కు సంబంధించి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం 6 రోజుల పాటు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు వివరించారు. అందుకు సంబంధించిన పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రం అందుకుంటున్న కళాశాల ప్రతినిధులు

### దేవాలయ భూములకు పెరిగిన కౌలు

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైదన గ్రామంలో ఉన్న దేవాలయాల భూములకు బుధవారం కౌలు వేలం నిర్వహించారు. ఈ ఏడాది దేవాలయ భూముల కౌలు వేలం పెరిగిందని దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు.రామలింగేశ్వరస్వామికి చెందిన 14.40 ఎకరాలకు రూ. 2.12 లక్షలకు వేలంలో రైతులు పాడారని అలానే చెన్న కేశవ స్వామి ఆలయానికి చెందిన 6.25 ఎకరాల భూమికి రూ. 1.76 లక్షలకు వేలం పాడారు. గత ఏడాది కంటే వేలం పాట పెరిగిందని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

## స్వామిత్వ సర్వేపై సిబ్బందికి శిక్షణ

పంగులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామ కంఠం కేంద్రంగా సాంకేతికతను వినియోగించి స్వామిత్వ సర్వే నిర్వహించి ప్రతి కుటుంబానికి సంపద కార్డులు జారీ చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుమంత్ తెలిపారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారాలలో స్వామిత్వ సర్వేపై సిబ్బందికి రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

### రోటరీ క్లబ్ నూతన కమిటీ నియామకం

రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు 2025 - 26 సంవత్సరానికి నూతన కమిటీ నియామకం జరిగింది. కమిటీ అధ్యక్షునిగా పంగులూరుకు చెందిన విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ బత్తుల వీరనారాయణ, కార్యదర్శిగా అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావులు నియమితులయ్యారు.

ఉపాధ్యక్షుడిగా చిలుకూరి ప్రసాద్‌నాయుడు, కోశాధికారిగా షేక్ కాలేషావలి, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా గుర్రం అంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా రావూరి రంగారావు నియమితులయ్యారు. ఈ నెల 31న నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించనుంది.

### నేడు అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం

అద్దంకి,జూలై30(ఆంధ్రజ్యోతి): అద్దంకి పురపాలక సంఘం అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు. 20 అంశాల అజెండాతో సమావేశం జరుగుతుందన్నారు.



మార్క్‌ఫెడ్ ఎండీ కరుణశ్రీ నుంచి వివరాలు అడిగి తెలుసుకొంటున్న మార్కెటింగ్‌శాఖ కమిషనర్ విజయ సునీత

## గోడౌన్‌ల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

● మార్కెటింగ్‌శాఖ కమిషనర్ విజయ సునీత

పర్చూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసి నిల్వచేసే విధంగా అందుబాటులో ఉన్న గోడౌన్‌లను సిద్ధం చేయాలని మార్కెటింగ్‌శాఖ కమిషనర్, ఎండీ విజయ సునీత అధికారులను ఆదేశించారు. రైతుల వద్ద ఉన్న పొగాకు ఉత్పత్తులకు సరిపడ గోడౌన్‌లు అందుబాటులో లేకపోవటంతో కొనుగోలుకు కొంత ఇబ్బందిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎంత పరిమాణంలో కొనుగోలు చేశారు, గోడౌన్‌ల పరిస్థితి అన్నవిషయంపై బాపట్ల జిల్లా మార్క్‌ఫెడ్ ఎండీ కరుణశ్రీతో చర్చించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

### ప్రణాళిక ప్రకారమే విద్యాభ్యాసం

వేటపాలెం(చీరాల), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళిక బద్ధంగా విద్యాభ్యాసం చేయాలని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. బుధవారం వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో సుమారు 150 మంది విద్యార్థులకు సాంఘిక ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, అవ్వారు సుజాత, జయంతి ఉచితంగా సాంఘిక శాస్త్రం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయిని సరోజని మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన బ్లూప్రింట్ ఆధారంగా స్టడీ మెటీనియల్ సిద్ధం చేసినట్లు వివరించారు. పల్నాడు జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మిరియాల శివశంకర్ అండ్ టీం అత్యంత వేగవంతంగా మెటీరియల్ తయారు చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాల్వపనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

### మేజరుకు మరమ్మతులు ప్రారంభం

ఇంకొల్లు,జూలై 30,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు మండల పరిధిలో ఉన్న ఇడుపులపాడు సాగర్ మేజరు కాల్వ మరమ్మతు పనులు బుధవారం ప్రారంభించారు. కాల్వకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లతో పాటు కాల్వ పూడిక తీత పనులు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పర్చూరు ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు,కొణికి పీఏసీఎస్ ఛైర్మన్లు కరి శ్రీనివాసరావు,బోడెంపూడి సుబ్బారావు,నీటి సంఘం అధ్యక్షుడు బత్తుల రామకృష్ణ, టీడీపీ టౌన్ అధ్యక్షుడు వలేరు మార్క్ పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పర్చూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల అలవాటుకు లోనై జీవితాలను వృథా చేసుకోవద్దని ఎస్సై జీవీ చౌదరి సూచించారు. బుధవారం పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెం బాలయోగి గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ట్రైనీ ఎస్సై గోపి, ఎస్సై సాంబశివరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

### బ్యాంకు సేవలను సద్వినియోగించుకోవాలి

చినగంజాం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీబీ చినగంజాం శాఖ మేనేజర్ డి.పోతురాజు అన్నారు. మండలంలోని మన్నంవారిపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అందిస్తున్న పథకాలు, సేవలపై బ్యాంకు ఖాతాదారులకు బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంకులో అకౌంట్ ఉన్న ప్రతి ఖాతాదారుడు ఏ ఏ సేవలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

### భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడండి

ఇంకొల్లు,జూలై 30,(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల వద్ద భద్రతా ఏర్పాట్లపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య అన్నారు.ఇంకొల్లు సర్కిల్ కార్యాలయంలో బుధవారం బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి బ్యాంకులో ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పని చేసేలా చూడాలని అన్నారు. ఇంకొల్లు ఎస్సై సురేష్,ఇంకొల్లు పరిధిలోని అన్నీ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.